epaper.samayamdaily.net APTEL/2006/18267

S TV SAMAYAM

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 9948313985/ 8978980131

సంపుటి: 19 | సంచిక: 98 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 30 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |




## మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులపై ఈసీ యాప్

■ రాష్ట్ర ఎన్నికల సంఘం 2

## పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

### శాస్త్రీయ విధానంతో గాలి నాణ్యతపై తెలంగాణ దృష్టి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పిం చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

■ ఇద్దరు మావోల మృతి 2



## స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ

- కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు
- టీవీ సీరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్
- మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్

04

# కేసీఆర్‌కు బిగ్‌షాక్

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు

### నేటి మధ్యాహ్నం విచారణ చేపడతామని వెల్లడి




**హైదరాబాద్, జనవరి 29:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. ఈ కేసులో ఇటీవల హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు సంతోష్‌రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. ప్రధానంగా ఇప్పటి వరకు ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. తాజాగా.. కేసీఆర్‌నూ విచారించాలని సిట్ నిర్ణయించింది.

మిగతా 2 లో

## నేటి విచారణకు రాలేను..

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. శుక్రవారం జరగాల్సిన విచారణకు తాను హాజరు కాలేనని స్పష్టం చేస్తూ జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి ఆయన రెండు పేజీల లేఖ రాశారు.



- మున్సిపల్ ఎన్నికలతో బిజీగా ఉన్నా
- సిట్ నోటీసులకు కేసీఆర్ సమాధానం

2

## అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా లక్ష్యం

- రాజస్థాన్, గుజరాత్ విధానాలు అధ్యయనం చేయాలి
- సీఎస్ రామకృష్ణారావు

2



రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.



# అదృష్టంతో విజయం వరించదు

### కృషి, లక్ష్యం ఉంటేనే సాధ్యం

- గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ అగ్రస్థానమే లక్ష్యం
- హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సీఎం రేవంత్

**విజయం అనేది అదృష్టం వల్ల రాదని.. నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని తన విజయ మంత్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో విద్యార్థులకు బోధించారు. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు సీఎం రేవంత్ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను పంచుకున్నారు.**

**హైదరాబాద్, జనవరి 29:** హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సీఎం రేవంత్ తన ఆలోచనలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశర చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లో నూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. తన పర్యటనలో భాగంగా సీఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ.. రాజకీయ, విద్య, ఆర్థిక

మిగతా 2 లో



## మామునూరు కల సాకారం

- సీఎం చొరవతోనే సాధ్యమైంది
- కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

2



## దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

- ఐరోపా ఒప్పందంపై మోడీ
- రాష్ట్రపతి ప్రసంగం ఆత్మ విశ్వాసాన్ని ప్రతిబింబించిందని వ్యాఖ్య

4

## జీడీపీ వృద్ధి

- పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే
- ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్

4





మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సమ్మక్క గద్దెలపై కొలువుదీరారు. అంతకుముందు వనం (చిలకలగుట్ట) వీడి జనంలోకి సమ్మక్క ఆగమనం ప్రారంభమవడంతో సమ్మక్క తల్లికి గౌరవసూచకంగా గాల్లోకి ములుగు జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపారు. సమ్మక్క రాక సందర్భంగా శివసత్తుల పూనకాలు వచ్చాయి.

## మేడారం గిరిజనుల మహాకుంభమేళా

- దేశంలనే అతి పెద్ద గిరిజనుల పండగ
- కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరం
- కిషన్‌రెడ్డితో కలిసి గద్దెల వద్ద పూజలు

2



మేడారం సమ్మక్క-సారక్క జాతరను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోందని జువల్ ఓరం అన్నారు.



## అదృష్టంతో విజయం వరించదు

మొదటి పేజీ తరువాయి

వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. సీఎం అమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా విదేశాల్లో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉంది. విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో సీఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పొందుతున్న ఈ ప్రపంచ స్థాయి విద్య, కేవలం మీ కెరీర్ కోసమే కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడాలని మార్గనిర్దేశర చేశారు. భారతీయ యువత మేథస్సు ప్రపంచాన్ని శాసిస్తోందని వ్యాఖ్యానించారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

## కేసీఆర్‌కు బిగ్‌షాక్

మొదటి పేజీ తరువాయి

ఇందులో భాగంగానే విచారణ చేపట్టేందుకు సిట్ అధికారులు సన్నద్ధమైనట్టు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీపీ సజ్జనార్ నేతృత్వంలో మార్పులు చేర్పులు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను విచారించి, వారిని రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్‌లో బాధ్యులుగా ఉన్నవారిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా.. మాజీ ముఖ్యమంత్రిని సిట్ అధికారులు విచారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కేసీఆర్ ఈ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

## నేటి విచారణకు రాలేను..

### మున్సిపల్ ఎన్నికలతో బిజీగా ఉన్నా

### సిట్ నోటీసులకు కేసీఆర్ సమాధానం



**హైదరాబాద్, జనవరి 29:** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. శుక్రవారం జరగాల్సిన విచారణకు తాను హాజరు కాలేనని స్పష్టం చేస్తూ జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి ఆయన రెండు పేజీల లేఖ రాశారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోందని, శుక్రవారమే నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అభ్యర్థులకు బీ-ఫాంలు కేటాయించే పనిలో తాను నిమగ్నమై ఉన్నానని కేసీఆర్ ఆ లేఖలో వివరించారు. ఈ అత్యవసర రాజకీయ కారణాల దృష్ట్యా విచారణను మరో రోజుకు వాయిదా వేయాలని ఆయన కోరారు. లేఖలో కేసీఆర్ విచారణా నిబంధనలను ప్రధానంగా ప్రస్తావించారు. 160 సీఆర్‌పీసీ నిబంధనల ప్రకారం 65 ఏళ్లు పైబడిన పురుషులు విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని, విచారణాధికారులే వారి నివాసానికి వెళ్లి వివరాలు సేకరించాలని గుర్తు చేశారు. అలాగే తన నివాసం ప్రస్తుతం ఎర్రవల్లిలో ఉన్నందున, ఇకపై తనకు పంపే నోటీసులను అక్కడికే పంపాలని, విచారణ కూడా ఎర్రవల్లిలోనే చేపట్టాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, బాధ్యతగల పౌరుడిగా విచారణకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ముందస్తు నోటీసులు ఇచ్చి, తన నివాసం వద్దే విచారణ జరిపేలా తదుపరి చర్యలు తీసుకోవాలని సిట్ అధికారులకు పంపిన ప్రత్యుత్తరంలో ఆయన స్పష్టం చేశారు.

## ఛత్తీస్‌గఢ్ ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోల మృతి

**రాయ్‌పూర్, జనవరి 29:** ఛత్తీస్‌గఢ్ మరోమారు రక్తమోడింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించినట్లు అధికారులు తెలిపారు. బీజాపూర్ జిల్లా దక్షిణ భాగంలోని అడవీ ప్రాంతంలో గురువారం ఉదయం 7.00గంటల సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుండి ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను, ఎకె47 రైఫిల్, 9ఎంఎం పిస్టల్, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆపరేషన్ కొనసాగుతోందని అన్నారు. జనవరి 3న బస్తర్ ప్రాంతంలోని బీజాపూర్ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పద్నాలుగు మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్‌లలో సుమారు 22మంది మావోయిస్టులు మరణించారు.

## మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులపై ఈసీ యాప్ ప్రారంభం

**హైదరాబాద్,జనవరి 29:** తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. అలాగే.. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని ఎస్ఈసీ పేర్కొంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పక్రియ ప్రారంభమైంది. మొత్తం 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్లకు అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 11వ తేదిన పోలింగ్ జరగనుంది, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

### శాస్త్రీయ విధానంతో గాలి నాణ్యతపై దృష్టి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, జనవరి 29:** పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'గాలి నాణ్యత సూచీ-గాలి నాణ్యత నిర్వహణ' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ ఎదురెదురుగా కాకుండా చేతులు కలిపి ముందుకు సాగాలన్నారు. హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా వేగంగా ఎదుగుతున్న నగరమని, అదే సమయంలో నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాల్సిన అవసరం ఉందన్నారు. శుభ్రమైన గాలి కేవలం పర్యావరణ అంశమే కాకుండా ప్రజారోగ్యం, ఉత్పాదకత, ఆర్థిక వృద్ధితో నేరుగా ముడిపడి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గాలి నాణ్యత పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా రియల్‌టైమ్, విశ్వసనీయ డేటా లభిస్తుందన్నారు. 2025 గాలి శుభ్రత కార్యాచరణ ప్రణాళిక ద్వారా వాహనాలు, రోడ్డు ధూళి, నిర్మాణాలు, పరిశ్రమలు, బహిరంగ దహనం వంటి కాలుష్య మూలాలపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలు, ఈ-బస్సులు, మెట్రో విస్తరణ, ఛార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టామని చెప్పారు. 2030 నాటికి సౌర, గాలి, గ్రీన్ హైడ్రజన్ ద్వారా 20 వేల మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పరిశ్రమల వల్ల సుమారు 32 శాతం కాలుష్యం ఉత్పన్నమవుతోందని అధ్యయనాలు వెల్లడించాయన్నారు. ఒకప్పుడు నగర అంచున ఉన్న పరిశ్రమలు ఇప్పుడు నివాస ప్రాంతాల మధ్యకి రావడం వల్ల ప్రజల భద్రత, ఆరోగ్యంపై తీవ్రమైన ప్రమాదాలు ఏర్పడుతున్నాయని హెచ్చరించారు. పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ, జోనింగ్ సంస్కరణలు, భూ వినియోగ ప్రణాళికలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే గాలి నాణ్యత డ్యాష్‌బోర్డును త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. కాలుష్య ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రత్యేక చర్యల బృందాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించి, ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సూచనలను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా అమలు చేయాలని కోరారు.

# గిరిజనుల మహాకుంభమేళా మేడారం

### దేశంలనే అతి పెద్ద గిరజనుల పండగ

### కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం

### కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద మంత్రుల పూజలు



**మేడారం, జనవరి 29:** మేడారం సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు,డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద 1 లక్ష కోట్లు పీఎం జన్-మన్ యోజన కింద 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గిరిజన వ్యవహారాల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటై, తొలి క్యాబినెట్ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన వీరుల త్యాగాలను దేశం గౌరవిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ జాతర గిరిజన ప్రజల అతిపెద్ద పండుగ. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు ఇక్కడికి వస్తారని తెలిపారు. జాతర ఏర్పాట్లలో భాగస్వాములైన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి 80 కోట్లు, రామప్ప దేవాలయ అభివృద్ధికి 140 కోట్లు, ఈ ఏడాది జాతర నిర్వహణకు 3.70 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సమ్మక్క-సారక్క పేరుతో 890 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంబించు కుంటామని వెల్లడించారు. లక్షలాది మంది వచ్చే ఈ మహాజాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# మామునూరు కల సాకారం

- **సీఎం చొరవతోనే సాధ్యమైంది**
- **కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు**




**హైదరాబాద్,జనవరి 29 :** రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చొరవ వల్లే మమునూరు ఎయిర్‌పోర్ట్ కల నెరవేరుతోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం రాకముందు మమునూరు అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌గా ఉండేదని అన్నారు. మమునూరు ఎయిర్‌పోర్ట్‌కు 696 ఎకరాలు మాత్రమే ఉందని, అయితే 180 సీట్ల విమానం దిగాలి అంటే రన్ వే పొడవు 2500 మీటర్లు ఉండాలని మంత్రి తెలిపారు. మునూరు ఎయిర్‌పోర్ట్ కల నెరవేరాలంటే మరో 259ఎకరాలు అవసరమని మంత్రి తెలిపారు. గతంలో ఎవరూ ఆ భూమిని సేకరించలేదని, అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రికార్డ్ టైమ్‌లో రైతులను ఒప్పించి భూమి సేకరించిందని ప్రశంసించారు. ఏవియేషన్ మంత్రిగా ఎక్కువ ఎయిర్-పోర్ట్‌లు నిర్మించాలనేది తన లక్ష్యమని, రాష్ట్రాలు సహకరించి భూములు ఇస్తే కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తర్వాత గొప్ప వారసత్వ నగరమైన వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా.. నిర్మాణం చేసుకోలేక పోయామని, ఇప్పుడు ఆ కల నెరవేరుతోందని అన్నారు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ 5వేల ఎకరాల్లో నిర్మిస్తామంటే అందరూ నవ్వారని, అన్ని వేల ఎకరాలు ఉండటం వల్లే నేడు ఆపరేషన్, మెయింటెనెన్స్, రిపేర్ కేంద్రాలకు వీలు అవుతోందని మంత్రి పేర్కొన్నారు. అందువల్లే హైదరాబాద్ ఏవియేషన్ హబ్‌గా ఎదిగిందన్నారు. పోటీపడి రాజకీయాలు చేయడం కాదు.. అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు నేర్పించారని అన్నారు. తెలంగాణను కూడా అభివృద్ధి చేయాలని తమ గురువు చంద్రబాబు చెప్పారని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా లక్ష్యం

### రాజస్థాన్, గుజరాత్‌ను అధ్యయనం చేయాలి

### సీఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్, జనవరి 29:** రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఆదేశించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఇంధన, వైద్య ఆరోగ్య, ఐటీ, పరిశ్రమలు, మైన్స్, టీజీఐఐసీ, ఫ్యూచర్ సిటీ, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల ఉన్నతాధికారులతో సవివర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, టీజీ ఎస్పిడిసిఎల్, టీజీ ఎన్‌పిడిసిఎల్‌లలో కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యుత్ విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్‌నగర్, పరిగి ప్రాంతాల్లో ప్రతిపాదించిన సబ్‌స్టేషన్ల పనుల పురోగతిని పరిశీలించారు. అండర్‌గ్రౌండ్ కేబులింగ్, ఈ-గవర్నెన్స్, విజన్‌ఉ2047 లక్ష్యాలపై అధికారులతో చర్చించారు. వైద్య రంగంలో వరంగల్, ఆల్వాల్, సనత్‌నగర్, ఎల్.బి.నగర్, న్యూ ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రుల విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత, మందుల సరఫరా, వైద్యులు, నర్సుల నియామకాలు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ, దూర ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఐటీ శాఖలో డిజిటల్ గవర్నెన్స్, పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రవ్యాప్తంగా ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణపై సమీక్షించారు. ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా ప్రజలకు అందించేలా ఐటీని వినియోగించాలని ఆదేశించారు. మైన్స్ శాఖలో ఇసుక సరఫరా, సాండ్ రీచ్‌లలో సీసీటీవీల ఏర్పాటు, ఫ్యూచర్ సిటీ, టీజీఐఐసీ, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, మెట్రో వాటర్ వర్క్స్ ప్రాజెక్టుల పురోగతిపై కూడా సీఎస్ సమీక్షించారు. ఈ సమావేశంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, శాఖల కార్యదర్శులు, సీఎండీలు, కమిషనర్లు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు నోటీసులు కక్షసాధింపు చర్య

- ఇది ప్రతీకారం తప్ప మరోటి కాదు
- ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, జనవరి 29:** విచారణల పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, నోటీసులతో చరిత్రను చెరిపేయలేరని కేటీఆర్ వెల్లడించారు. ఇది విచారణ కాదు.. ఇది ప్రతీకారం. ఇది న్యాయం కాదు.. ఇది రాజకీయ దురుద్దేశం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే



తగిన గుణపాఠం చెబుతారు. ఈ కక్షసాధింపు రాజకీయాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది.' చావు నోట్లో తలబెట్టి.. కేసీఆర్ సచ్చుడో – తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్. సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్దాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం' అని కేటీఆర్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు.. ప్రజల తీర్పుతోనే రాస్తారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# కక్షపూరిత రాజకీయాలకు పరాకాష్ట

- రేవంత్ ప్రభుత్వ తీరుపై హరీష్ రావు ఆగ్రహం
- మండిపడ్డ పలువురు మాజీ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, జనవరి 29 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీచేయడంపై ఆ పార్టీ వర్గాలు మండిపడ్డాయి. ఇది పూర్తిగా కక్షపూరిత రాజకీయమని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ఠ అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే అని హెచ్చరించారు. ఈ మేరకు హరీష్‌రావు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్‌రావు తన పోస్టులో పేర్కొన్నారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలంపాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి చరిత్రాత్మక నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం అంటే సూర్యునిపై ఉమ్మి వేసే ప్రయత్నమేనని మండిపడ్డారు. పరిపాలనలో చేతకానితనంతో ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి దృష్టి మళ్లించేందుకు, సిట్ పేరుతో నోటీసులు జారీచేయడం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని హరీష్‌రావు విమర్శించారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ది పొందవచ్చని భావించడం రేవంత్‌రెడ్డి రాజకీయ దివాళాకోరు తనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. చరిత్రను సృష్టించిన నాయకుడు కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని హరీష్‌రావు మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉన్నదని అన్నారు. కాంగ్రెస్ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు ఇదే నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని మండిపడ్డారు. పరిపాలన విధివిధానాలు తెలియని వాళ్లు పాలకులుగా ఉండటం దురదృష్టకరమని.. నియంతృత్వ పోకడలకు ప్రజలే అడ్డుకట్టవేస్తారని క్రాంతి కిరణ్ అన్నారు. కేసీఆర్ కీర్తిని దిగజార్చాలనే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ నోటీసులు జారీ చేసిందని మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ తెచ్చిన ధీరుడికి కేసులు, కొట్లాట, కోర్టులు కొత్తకాదు అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడిన వీరుడు కేసీఆర్. ఈ కాంగ్రెస్ నేతల సిట్, బొట్‌లకు భయపడబోరన్నారు. న్యాయస్థానాల మీద, వ్యవస్థ మీద నమ్మకం ఉందన్నారు. కమిషన్లు, సిట్‌లు, కేసులులకు అదరం బెదరమన్నారు. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పలేకనే సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపారని మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులపై ఆయన స్పందించారు. కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్ష్య సాధింపు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా వైఫల్యం, కాంగ్రెస్ వరుస స్కాంల నుంచి దృష్టి మళ్లించేందుకే సిట్ నోటీసులు ఇచ్చిందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు సింహాల్లా గర్జిస్తూనే ఉంటారు. కేసీఆర్ వెంట తెలంగాణ సమాజం అంతా ఉంది. మీ కేసులకు, నోటీసులకు భయపడేది లేదు. అక్రమ కేసులపై ప్రజా క్షేత్రంలోనే బీఆర్ఎస్ తేల్చుకుంటుందని స్పష్టం చేశారు.

# చైన్ స్నాచింగ్‌లపై అవాస్తవ ప్రచారాలు

**సోషల్ మీడియా పుకార్లపై కమిషన్ సజ్జన్నార్**






**హైదరాబాద్, జనవరి 29:** బంగారం రేట్లు పెరగడంతో చైన్ స్నాచింగ్‌లు విపరీతంగా పెరిగిపోయాయని, అంతర్రాష్ట్ర ముఠాలు హైదరాబాద్‌లో మకాం వేశాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నమ్మవద్దని అదంతా ఉత్తిదే అని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. ఇలాంటి ప్రచారాలు రావడంపై ఆయన స్పందించారు. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. ఇలాంటివి నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు. దయచేసి సోషల్ మీడియాలో వచ్చే ధ్రువీకరించని వార్తలను, భయపెట్టే పోస్టులను ఫార్వార్డ్ చేయకండి. భయాందోళనలు సృష్టించేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ నగరం పూర్తిగా సురక్షితం. శాంతిభద్రతల పరిరక్షణలో మాకు సహకరించండి. ఏదైనా అనుమానం వస్తే డయల్ 100కు కాల్ చేయండి. నిశ్చింతగా ఉండండి. మీ భద్రతే మా బాధ్యతని పేర్కొన్నారు.

# మేడారం జాతరను జాతీయపండుగగా గుర్తించాలి

**కేంద్రానికి మంత్రి పొంగులేటి విజ్ఞప్తి**

**మేడారం, జనవరి 29:** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండోసారి సమ్మక్క–సారక్క జాతర ఇదేనని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భక్తుల సౌకర్యార్థం అనేక శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టిందని రాష్ట్ర మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మేడారంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సమ్మక్క?సారక్క జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రుల పర్యటనతో ఈ అంశం త్వరలోనే సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క–సారక్క జాతరను గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, మరో కుంభమేళాగా ఆయన అభివర్ణించారు. ఈ మహాజాతర విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన అధికారులు, సిబ్బంది మరియు సహకరించిన మీడియా మిత్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యవేక్షణలో కేవలం 90 రోజుల్లోనే ఆలయ అభివృద్ధి పనులు మరియు మౌలిక వసతులు పూర్తి చేసినట్లు తెలిపారు. సాధారణంగా నాలుగు రోజులపాటు జరిగే జాతరను, ఈసారి భక్తుల రద్దీ దృష్ట్యా విస్తృత ఏర్పాట్లతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జాతర ప్రశాంతంగా, సవ్యంగా కొనసాగుతోందని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, ఇతర జిల్లాల నుంచి వచ్చి సేవలందించిన సిబ్బంది మరియు సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గద్దెల పునర్నిర్మాణం సహా మౌలిక సదుపాయాల పనులు నిర్ణీత కాలంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం గారికి విజ్ఞప్తి చేసినట్లు, అలాగే జాతర నిర్వహణకు మరింత ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ కేంద్ర మంత్రులకు వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. లక్షలాది



మంది భక్తులు హాజరవుతున్న ఈ మహాజాతరలో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంటూ, జాతర విజయవంతానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు మరియు మీడియా మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ రాష్ట్రం

- కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు
- టీవీ సీరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్
- మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు
- మండిపడ్డ బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

**న్యూఢిల్లీ, జనవరి 29:** తెలంగాణ రాష్ట్రంలో స్కామ్‌లు వేగంగా పరిగెడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ అమలు కావడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా, వైఫల్యాలను మెరుగుపరచడానికి కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కుంభకోణాలు, అవినీతి, మంత్రుల మధ్య గొడవలు రోజువారీ వార్తలుగా మారాయని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం స్కామ్‌లకు పరిశోధన కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రోజువారీ టీవీ సీరియల్‌గా మార్చారని, రోజుకో పేరును ప్రస్తావిస్తూ సిట్ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ సాధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను శిక్షించిన పాపాన పోలేదని ఎంపీ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందనే అనే భయంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి గేమ్ ఆడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. మున్సిపాలిటీలలో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. 106 మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం స్మార్ట్ సిటీ, పట్టణాల అభివృద్ధి కోసం పని చేస్తోందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తేనే ప్రోగ్రెస్ జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఒక వర్గాన్ని సంతోషపరచడం కోసమే పని చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ.. ఓ ఫెయిల్యూర్ నాయకుడు అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

# ఇప్పటికే 80 లక్షల మంది దర్శనం

**మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీతక్కల వెల్లడి**



**మేడారం, జనవరి 29:** మేడారం సమ్మక్క–సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మాట్లాడుతూ, గురువారం దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ పక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయను న్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు. క్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యత ను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ. 2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్ప?లక్నవరం?జంపన్న వాగు వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో అత్యంత తక్కువ సమయంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఇరుకైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఉండేవని, ఈసారి ఫోర్–లేన్ రోడ్లతో రాకపోకలు చాలా సులభమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థతో పాటు భారీ సంఖ్యలో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చెట్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.జాతర విజయవంతానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగం మరియు మీడియా మిత్రులకు సీతక్క అభినందనలు తెలిపారు.నివారం సాయంత్రం 4 గంటలకు తల్లులు గద్దెల నుంచి తిరిగి వనప్రవేశం చేయనున్నారని, అప్పటివరకు భక్తులు ఓపికతో దర్శనాలు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



## సంపాదకీయం

# తెలంగాణలో పట్టణ పోరుకు రంగం సిద్ధం!

ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగ. సవాళ్లు, ప్రతి సవాళ్లతో కాలం గడిపేయవచ్చు. అనుయాయులను గెలిపించుకునేందుకు ఆరాటపడం తప్ప మరోటి ఉండదు. మొన్నటికి మొన్న తెలంగాణలో గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సందడి ముగిసింది. ఇప్పుడు మున్సిపల ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ పార్టీల్లో హడావిడి జోరందుకుంది. పార్టీ పరంగానే ఎన్నికలు జరగనున్న కారణంగా అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే మున్సిపాలిటీల్లో పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో పట్టణాలు, గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా మున్సిపల్ పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. బుధవారం నుంచి నామినేషన్ల ఘట్టం మొదలయ్యింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మొత్తంగా పంచాయితీ తరవాత ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయ్యింది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. షెడ్యూల్ విడుదలతో పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని పట్టణాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో అభ్యర్థులు తలమునకల య్యారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గ చూపుతారు. పురపోరులో పాల్గొనదల్చిన అభ్యర్థులు ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టారు. ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇదిలా ఉంటే పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ గుర్తింపు ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించు కునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. పట్టణాలు, వార్డుల్లో మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుం డటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా పట్టణాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.




# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

- ఐరోపాతో ఒప్పందంపై మోడీ
- రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, జనవరి 29:** పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని స్పష్టం చేశారు. ÷ాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్దిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్- ట్రాన్స్‌ఫామ్ అంటూ బ్జడెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ది పొందాలని కోరుతున్నాను. ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదని అన్నారు.

# జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి


## పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే

### ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, జనవరి 29:** దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వేను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.గత ఆర్థిక సంవత్సరంలో భారత్ సాధించిన అభివృద్ధి, ఎదురైన సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలక విషయాలను ఆర్థిక సర్వేలో ప్రస్తావిస్తారన్న విషయం తెలిసిందే. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తేల్చింది. సుస్థిర దేశీయ డిమాండ్, స్థూల ఆర్థిక అంశాలు సానుకూలంగా ఉండటంతో భారత ఆర్థిక ప్రగతికి ఢోకా లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ప్రతికూల అంశాల ప్రాబల్యం కొనసాగుతోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక ప్రగతి ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగుతుంది. స్థూలంగా చూస్తే వస్తువుల ధరలు ఈ ఏడాదిలో స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. కృత్రిమ మేధతో ఆశించిన మేర ఆర్థిక ఫలాలు అందకపోతే ఆస్తుల విలువ తరిగి ఆర్థికరంగంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించవచ్చు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నా రాబోయే రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే అవకాశం ఉందని కూడా ఆర్థిక సర్వే అంచనా వేసింది.అమెరికా సుంకాల భారం ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసిందని ఆర్థిక సర్వే తేల్చింది. సుంకాల విధింపు తరువాత జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గినా వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థాగత మార్పులు, విధానపరమైన నిర్ణయాల కారణంగా సుంకాల భారాన్ని భారత్ తట్టుకోగలిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అ÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్ తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బ్జడెట్‌కు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.8-7.2 శాతంగా ఉండొచ్చు. గతేడాదితో పోలిస్తే అంచనాలను పెంచింది. 2025-2026కు జీడీపీ అంచనాలను 7.4 శాతం నుంచి తగ్గించింది. ఇటీవల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4? వృద్ధి రేటు నమోదుకావొచ్చని గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8శాతం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో అది 4.4 శాతంగా ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవు తుందని అంచనా వేసింది.వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయరంగం కీలకపాత్ర పోషిస్తుంది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇందులో మొబైల్ తయారీ కీలకం. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి.. రూ. 18వేల కోట్ల నుంచి రూ. 5.45 లక్షల కోట్లకు చేరింది. డిజిటల్ సేవల విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోంది. ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించింది.

# ఖర్గే, రాహుల్‌తో థరూర్ భేటీ




**న్యూఢిల్లీ, జనవరి 29:** కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీలతో సమావేశమయ్యారు. బుధవారం పార్లమెంటులో ఖర్గే కార్యాలయంలో కొన్ని గంటలపాటు ఈ సమావేశం జరిగింది. గతవారం కేరళలో జరిగిన కీలక సమావేశానికి థరూర్ హాజరుకాలేదు. దీంతో శశిథరూర్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారని ఊహాగానాలు వినిపించాయి. ఈ తరుణంలో ఖర్గేతో, రాహుల్‌తో శశిథరూర్ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం థరూర్ మీడియాతో మాట్లాడుతూ.. ' మా ఇద్దరి నాయకులతో మాట్లాడాను. మా చర్చలు సానుకూలంగా జరిగాయి. మేము కలిసి నడుస్తాము. నేను ఎప్పుడూ పార్టీ కోసం ప్రచారం చేశాను. నేను వ్యక్తిగతంగా ఎక్కడా ప్రచారం చేయలేదు' అని అన్నారు. మీరు ఎన్నికల్లో పోటీ చేస్తారా? సిఎం పదవి గురించి ఈ సమావేశంలో చర్చించారా అని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'ఈ విషయంపై మేము మాట్లాడుకోలేదు. ప్రస్తుతానికి నేను ఎంపిని. తిరువనంతపురం నుండి నా ఓటర్ల విశ్వాసం నాకు ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను నేను చూసుకోవాలి. అది నా పని' అని ఆయన అన్నారు. ఈరోజు ఖర్గేతో, రాహుల్‌గాంధీతో చర్చలు సజావుగా సాగినందుకు వారికి శశిథరూర్ కృతజ్ఞతలు తెలిపారు.

# అశ్రునయనాల మధ్య అజిత్ అంత్యక్రియలు

## ప్రభుత్వ లాంఛనాలతో వీడ్కోలు

### కేంద్రహోంమంత్రి అమిత్ షా తదితరుల నివాళి





**ముంబై, జనవరి 29:** అశ్రునయనాల మధ్య దివంగత మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం ఉదయం పుణెలోని బారామతి సమీపంలోగల విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. పవార్ పెద్దకుమారుడు అంత్యక్రియలను నిర్వహించారు. అంతకముందు.. కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నితిన్ నబిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రతిష్ఠాన్ మైదానానికి ప్రజలు పోటెత్తడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ప్రభుత్వ లాంఛనాల నడుమ తండ్రి చితికి ఆయన కుమారుడు నిప్పంటించారు. అజిత్ పవార్‌కు తుది వీడ్కోలు పలుకుతూ ఆయన భార్య సునేత్ర, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్‌ను కోల్పోయినందుకు పార్టీ నేతలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం ఉద్యం విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో చేపట్టారు. గురువారం ఉదయం ప్రారంభమైన అంతిమ యాత్రలో వేల మంది అభిమానులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఎపి మంత్రి నారా లోకేష్ సహా చాలా మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.బారామతి విమానాశ్రయం దగ్గర జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ (66) మ-రణించారు. ఈ దుర్ఘటనలో మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. అజిత్ పవార్ మృతదేహాన్ని మంగళవారం రాత్రి పుణ్యశ్లోక అహిల్యాదేవి ఆస్పత్రి నుంచి.. కాటేవాడిలోని ఇంటికి తరలించారు. ఉదయం 9 గంటలకు విద్యా ప్రతిష్ఠాన్ క్యాంపస్ నుంచి అంతిమ యాత్ర మొదలైంది. పూలతో అలంకరించిన రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ప్రధాన రోడ్ల గుండా ఈ యాత్ర సాగింది. 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తర్వాత భౌతికదేహాన్ని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌కు చేర్చారు. అక్కడ రాష్ట్ర లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. అజిత్ పవార్ కుమారులు చివరి క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, శరద్ పవార్, సుప్రియా సూలే సహా అన్ని పార్టీల నేతలూ పాల్గొన్నారు. అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడి, ఇతర ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మరోవైపు విమాన ప్రమాదంపై డీజీసీఏ, ఏఏఐబీ దర్యాప్తు మొదలైంది. బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దట్టమైన పొగమంచు, విజిబులిటీ తక్కువగా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. ఐతే.. దర్యాప్తు తర్వాత పూర్తి నివేదిక వస్తుంది. అందులో ఏం చెబుతారన్నది తేలాల్సిన అంశం. అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రలో మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించారు. ఆయనది ప్రమాద మరణమా, లేక కుట్ర పూరిత హత్యా అనే సందేహాలు ఉన్నాయి. అయితే ఈ అనుమానాలను శరద్ పవార్ తోసిపుచ్చారు.

# కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ వైద్యం

- పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్లు
- గర్భసంచి గడ్డలు, గాల్ బ్లాడర్ రాళ్ల తొలగింపు
- వైద్య బృందాలను అభినందించిన సూపరింటెండెంట్
- అధునాతన సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**పెద్దపల్లి, జనవరి 29 (సమయం న్యూస్):** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందుతున్నాయి. తాజాగా రెండు క్లిష్టమైన శస్త్రచికిత్సలను ప్రభుత్వ వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన 46 ఏళ్ల మహిళ గత కొంతకాలంగా గర్భసంచిలో ఏర్పడిన గడ్డలతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఆమె ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించగా, గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ పరీక్షించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. డాక్టర్ అనసూయ, డాక్టర్ రవళిక, డాక్టర్ కృష్ణవేణిల బృందం ఆ మహిళకు అత్యవసర శస్త్రచికిత్స చేసి గర్భసంచిని, అందులోని గడ్డలను విజయవంతంగా తొలగించింది.

అలాగే, పట్టణానికే చెందిన మరో 23 ఏళ్ల మహిళ గత రెండేళ్లుగా కుడివైపు కడుపునొప్పితో బాధపడుతోంది. ఆసుపత్రిలో పరీక్షలు చేయగా గాల్ బ్లాడర్ (పిత్తాశయం) మెడ భాగంలో 13.5 మిల్లీమీటర్ల రాయి ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు మూడు నెలల క్రితమే సిజేరియన్ జరిగి చంటిబిడ్డ ఉంది. ఈ విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌ను కోరారు. స్పందించిన వైద్యులు ఆమెకు అన్ని పరీక్షలు నిర్వహించి, డాక్టర్ అమర సింహారెడ్డి (లాప్రోస్కోపిక్ సర్జన్) నేతృత్వంలో అధునాతన పద్ధతిలో 'లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ' ఆపరేషన్ చేసి రాయిని తొలగించారు. ఈ సర్జరీలో డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ రాము, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు. విజయవంతంగా ఆపరేషన్లు చేసిన రెండు వైద్య బృందాలను సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.

### అన్ని రకాల సేవలు అందుబాటులో..

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం, 2డి ఎకో, అత్యాధునిక లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, దంత చికిత్స (రూట్ కెనాల్) సేవలు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. వైద్య సేవల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సీఎం కప్ వాలీబాల్ విజేత చిన్నశంకరంపేట

**అండర్-18 విభాగంలో సత్తా చాటిన బాలురు**

**బాలికల విభాగంలో మదూరు జట్టు విజయం**



**చిన్నశంకరంపేట, జనవరి 29 (సమయం న్యూస్):** శంకరంపేట (ఆర్) మండల స్థాయి సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో చిన్నశంకరంపేట జట్టు విజేతగా నిలిచింది. గురువారం స్థానిక పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్-18 బాలుర విభాగంలో శంకరంపేట (ఆర్) క్లస్టర్ ప్రథమ స్థానంలో నిలవగా, మీర్జాపల్లి క్లస్టర్‌కు చెందిన వెంకటాపూర్ గ్రామ జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. బాలికల విభాగంలో మదూరు క్లస్టర్‌కు చెందిన మదూరు గ్రామ బాలికలు ప్రథమ స్థానంలో, జి.ప.ఉ.పా. శంకరంపేట (ఆర్) విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరూ ఆయా పాఠశాలల విద్యార్థులే కావడం విశేషం. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎంఈవో పుష్పవేణి, శంకరంపేట (ఆర్) ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు పోచయ్య, పీడీలు రతన్, నరేష్, బూదయ్య, శిల్పా, రహీమ్, నాగరాజు, ఉపాధ్యాయులు బాలరాజు, కిషన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# కొల్చారంలో 'స్వయం' పాలన సందడి

**ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు**

**కలెక్టర్‌గా పాఠశాలను తనిఖీ చేసిన హారిక**

**అధికారులుగా విధులు.. తరగతి గదిలో బోధన**

**కొల్చారం, జనవరి 29 (ఇదే నిజం):** కొల్చారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా మారి పాఠశాలను నడిపించారు. తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి మెప్పించారు. రాంపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని హారిక జిల్లా కలెక్టర్ పాత్రలో పాఠశాలను తనిఖీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే మరో విద్యార్థిని డిప్యూటీ కలెక్టర్‌గా, మరికొందరు ప్రధానోపాధ్యాయుడిగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఒక్కరోజు పాటు విద్యార్థులు అధికారుల పాత్రల్లో ఒదిగిపోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

# తుక్కాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహణ**



**కొల్చారం, జనవరి 29 (సమయం న్యూస్):** సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో కొల్చారం మండలం తుక్కాపూర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు కోరారు. వైద్య సిబ్బంది గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఉప సర్పంచ్ ఆరె రవీందర్, వార్డు సభ్యులు సుధాకర్, మమతా శ్రీనివాస్, చంద్రకల రాజప్ప, నవీన్, గంగయ్య, అంజయ్య, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు మల్లప్ప, ప్రభాకర్, రామయ్య, లింగప్ప, డీలర్ శివ శంకర్, రామకిష్టి, శ్రీశైలం, శివాజీ, ఆయలి శేఖర్, వైద్య సిబ్బంది తదితరులు హాజరయ్యారు.



# దేవరకద్రలో వాసవి మాత పల్లకి సేవ

**మాఘమాసం రెండో శుక్రవారం ప్రత్యేక పూజలు**

**లగిశెట్టి కళ్యాణి టీం ఆధ్వర్యంలో ఏర్పాట్లు**

**అధిక సంఖ్యలో హాజరుకావాలని కమిటీ పిలుపు**

**దేవరకద్ర, జనవరి 29 (సమయం న్యూస్):** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి పల్లకి సేవ వైభవంగా జరగనుంది. ఆలయంలో ప్రతి శుక్రవారం అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ శుక్రవారం కూడా సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మాఘమాసం రెండో శుక్రవారం సందర్భంగా లగిశెట్టి కళ్యాణి టీం (రెండో టీం) ఆధ్వర్యంలో ఉదయం 8:30 గంటలకు అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7:00 గంటలకు శ్రీచక్రాలకు కుంకుమార్చన, 7:30 గంటలకు లలితా సహస్రనామ పారాయణం ఉంటాయి. రాత్రి 8:30 గంటలకు అమ్మవారి పల్లకి సేవ, 9 గంటలకు మహా మంగళ హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది. లగిశెట్టి కళ్యాణి టీం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం (టిఫిన్) ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఆర్యవైశ్యులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్వ కన్నయ్య శెట్టి, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణి, యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ కోరారు.

# విద్యార్థులకు 'రోడ్డు భద్రత' పాఠాలు

**నిబంధనలు పాటించాలని ఏఎంవీఐ రఘుబాబు సూచన**



**దేవరకద్ర, జనవరి 29 (సమయం న్యూస్):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం దేవరకద్ర లోని డోకూర్ సమీపంలో ఉన్న తపోవన్ ఉన్నత పాఠశాల లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వాహన చట్టాలను వివరించారు. అనంతరం విద్యార్థులందరూ ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. చిన్ననాటి నుంచే నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రయ్య, నర్సింహులు, రవి, శ్రీనివాసులు, ఇక్బాల్ పాష, తిరుపతయ్య, కురుమూర్తి, నాగరాజు, అనురాధ, ఉమ, సబీహా, పావని, అనిత, భవాని, స్వప్న, శిరీష, కరిష్మా, మౌనిక, లత, గౌతమి, భార్గవి పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికే 'ప్రజాబాట'

**లూజు వైర్లు, స్తంభాల సమస్యలకు చెక్**

**సర్పంచ్ దృష్టికి తేవాలని ఏఈ హరీష్ సూచన**



**జూలపల్లి, జనవరి 29 (సమయం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఆదేశాల మేరకు జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో 'ప్రజాబాట' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ తొగరు శ్రీనివాస్‌తో కలిసి విద్యుత్ శాఖ ఏఈ హరీష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఈ హరీష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికే ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. లూజు వైర్లు సరిచేయడం, విద్యుత్ స్తంభాల కొరత తీర్చడం, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. గ్రామంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా వెంటనే సర్పంచ్ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జెల్ల కనుకయ్య, లైన్ మెన్ సంపత్, జేఎల్ఎం వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు తీగల అశోక్ గౌడ్, పెసరు లచ్చయ్య, కళ్ళేపెల్లి మహేందర్, గ్రామస్తులు బుర్రి మహేష్, రాజ్ కుమార్, పెద్దూరు అంజి, పెసరు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారవేత్త కైలాష్ సేట్ మృతి.. మద్నూర్‌లో విషాదం

**భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే షిండే నివాళి**



**జుక్కల్, జనవరి 29 (సమయం న్యూస్):** మద్నూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కైలాష్ సేట్ కాకాని అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషాద వార్త తెలుసుకున్న వెంటనే జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే గురువారం వారి నివాసానికి చేరుకున్నారు. కైలాష్ సేట్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కైలాష్ సేట్ మరణం మద్నూర్ మండలానికి తీరని లోటు అని హన్మంత్ షిండే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంత్యక్రియల్లో మద్నూర్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ తగాదాలు లేని జిల్లాగా మెదక్

**పక్కాగా నక్ష.. పటిష్టంగా రికార్డులు..భూభారతి రీసర్వేతో ఆక్రమణలకు చెక్**

**పాషాపూర్‌లో పైలట్ ప్రాజెక్ట్ షురూ.. గ్రామసభలో కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా, జనవరి 29 (సమయం న్యూస్):** మెదక్ జిల్లాను భూ తగాదాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రతి కమతానికి సరైన నక్ష, మ్యాప్, హద్దులను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులను నమోదు చేయాలని సూచించారు. 'భూభారతి' చట్టం కింద భూముల రీసర్వే కార్యక్రమం కోసం మెదక్ మండలంలోని పైలట్ గ్రామపంచాయతీ అయిన పాషాపూర్‌లో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. పాషాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని రీసర్వే కోసం గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. రైతులకు పక్కాగా భూ హద్దులు, భూమికి సంబంధించిన నక్ష, మ్యాప్‌లను నిర్ణయించి, పటిష్టమైన రికార్డులను తయారు చేయడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. డిజిటల్ సర్వే ద్వారా అక్షాంశ, రేఖాంశాలతో హద్దులు నిర్ణయిస్తామని, దీనివల్ల హద్దులు చెరిగిపోవడం, ఆక్రమణలకు గురికావడం వంటి సమస్యలు ఉండవని కలెక్టర్ వివరించారు. ఈ రీసర్వే అనంతరం రైతులు ఎక్కడికి వెళ్లినా, చివరకు విదేశాల్లో ఉన్నా తమ భూమిని ఆన్‌లైన్‌లో పరిశీలించుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. భవిష్యత్తులో పాషాపూర్‌ను నమూనాగా తీసుకొని జిల్లాలోని మరో 23 గ్రామాల్లో భూభారతి రీసర్వే చేపట్టి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న భూములన్నింటినీ రీసర్వే చేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## షేక్.ఫర్జానాకు ఉత్తమ ప్రతిభ పురస్కారం





**ఖమ్మం, జనవరి 28 : ( సమయం న్యూస్ )** ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా షేక్. ఫర్జానా ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్నారు. దివంగత షేక్. మహమ్మద్ ఖాసిం కుమార్తె షేక్. ఫర్జానా జిల్లాలో గల మధిర నియోజక వర్గం పరిధిలోని బోనకల్ మండల కేంద్రంలో టీజిటి బయో సైన్స్ ఉపాధ్యాకురాలిగా విధులు నిర్వహసిస్తున్నారు. బోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు , 2025 సంవత్సరానికి గాను ప్రశంస పత్రం పొందారు. ఈ నేపథ్యంలో ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్. ముజాహిద్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్. హుస్సేన్ లు పురస్కార గ్రహీత షేక్ . ఫర్జానా కు అభినందనలు ప్రకటించారు.

## వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలి..

- జిల్లావిద్యాధికారి గోవిందరాజులు..



**కోస్గి మండలం, జనవరి,29(సమయం న్యూస్) :** పదవ తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని నారాయణపేట జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు విద్యార్థులకు సూచించారు. గురువారం కోస్గి మండలంలోని సర్జఖాన్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో బోధన విషయాలపై అభిప్రాయాలను తెలుసుకుని, పాఠ్యాంశాలలో విద్యార్థులను పరీక్షించి, మంచి మార్కులను సాధించడానికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలను దత్తత తీసుకుని ప్రతిరోజు ఉదయము కాల్స్ చేస్తూ ప్రతిరోజు ఉదయం మరియు సాయంత్రం ప్రత్యేక తరగతులను తీసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం జిల్లా విద్యాధికారి గోవిందరాజులును పాఠశాల బృందము శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ నాయక్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణ మూర్తి, ఉపాధ్యాయులు వినోజ్, నవీన్ కుమార్,నర్సిములు, సాయప్ప,ఆశప్ప,గంగావతి మరియు మాధవి పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో పురపాలక ఎన్నికల మీడియా కేంద్రం ప్రారంభం



**ఖమ్మం, జనవరి 29 : ( సమయం న్యూస్ ) :** కలెక్టరేట్ మొదటి అంతస్తు, ఎఫ్-3లో గల జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా కేంద్రాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి గురువారం ప్రారంభించారు. పురపాలక ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా కేంద్రం ద్వారా నిఘా పెట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంబంధ సమాచారం మీడియా కు ఎప్పటికప్పుడు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. ప్రింట్ మీడియాలో ప్రచార ఖర్చుపై నిఘా, ఎలక్ట్రానిక్ మీడియా లో ప్రచార అనుమతులకు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసంబంధాల అధికారి ఎం.ఏ. గౌస్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మీడియా మానిటరింగ్ కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ కె. ప్రవల్లిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అనధికార వ్యక్తుల తొలగింపుకు పోలిస్ శాఖ ప్రత్యేక చర్యలు.

**తిరుమల జనవరి 29( సమయం న్యూస్). :** తిరుమలలో అనధికార వ్యక్తుల తొలగింపునకు సంబంధించిన ఆపరేషన్ఈ రోజు సాయంత్రం 6.00 గంటల నుంచి 8.30 గంటల వరకు, Area Domination Programme లో భాగంగా తిరుమలలో ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా తిరుమల పరిధిలో అనధికారికంగా నివసిస్తున్న భిక్షాటన చేసే వారు, హోటళ్లలో పనిచేస్తూ యాత్రికుల వసతి సముదాయాలను ఆక్రమించుకున్న వారు, KKC & DMB రోడ్డుల వెంట ఉన్న షెడ్లో దీర్ఘకాలంగా నివసిస్తున్న వ్యక్తులు, గుర్తింపులేని వ్యక్తులు మరియు ౹ా౹ం షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాల్లో పడుకుని ఉన్న వారిని గుర్తించి మొత్తం 32 మంది అనధికార వ్యక్తులను తిరుమల నుంచి తొలగించి, బస్సుల ద్వారా తిరుపతికి పంపించడం జరిగింది. అదనంగా, అనుమానాస్పదంగా కనిపించిన 15 మంది వ్యక్తులను 'పాపిలియన్ డివైస్' (Papillon Device) ద్వారా వారి క్రిమినల్ హిస్టరీపై తనిఖీ చేయడం జరిగింది. ఈ చర్యలు భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, తిరుమలలో శాంతిభద్రతలు మరింత పటిష్టంగా ఉండేలా కొనసాగించడం జరుగుతుందని పోలీస్ శాఖ అధికారులు తెలిపారు.

# వికారాబాద్ జిల్లా మున్సిపల్ ఎన్నికలపై పోలీసుల ప్రత్యేక దృష్టి

- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐ.పి.ఎస్



**వికారాబాద్, జనవరి,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (వీశీసవశ్రీ జశీసవ శీట జశీఅఏబష్ట -- వీజజ)ను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐ.పి.ఎస్ సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి పౌరుడు చట్టానికి లోబడి వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని ఆమె కోరారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అక్రమంగా మద్యం విక్రయం మరియు పంపిణీని కి అనుమతి లేదు అని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికారుల లిఖితపూర్వక అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, మైక్ సెట్లు లేదా శబ్ద కాలుష్యం కలిగించే పరికరాలు వినియోగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. రూ. 50,000/- కంటే ఎక్కువ నగదు తరలించాలంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలని, సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే సందేశాలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు ప్రచారం చేస్తే సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అధికారులకు ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, గతంలో గొడవలు చోటుచేసుకున్న సమస్యాత్మక (౹ావఅంట్ఆజవ) పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్నవారు, గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి, తహసీల్దార్ల ఎదుట బైండోవర్ (దీఆఅస-శీజవతీ) చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

- మీడియా సెంటర్ ప్రారంభం.
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ జనవరి29( సమయం న్యూస్). :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని వేగంగా, పారదర్శకంగా మీడియాకు అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ మొత్తం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా మీడియా సెంటర్ కీలక భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థుల వివరాలు, నామినేషన్లు, పోలింగ్ సరళి, ఓట్ల లెక్కింపు తదితర ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అధికారిక సమాచారం ఈ సెంటర్ ద్వారా మీడియాకు అందజేస్తామని తెలిపారు. డీపీఆర్ఓ విష్ణువర్ధన్ మీడియా సెంటర్ నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్,సాధారణ ఎన్నికల పరిశీలకులు డి. హనుమంత్ నాయక్, వ్యయ పరిశీలకురాలు ఎల్. విజయ, మీడియా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.



**కొడంగల్ మున్సిపల్, జనవరి,29(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ గురు వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు ఏయే ధ్రువీకరణ పత్రాలు జత చేయాలో స్పష్టంగా తెలియజేయాలని, ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే వెంటనే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల వివరాలను పరిశీలించారు. 1 నుండి 12 వార్డులు 4 కౌంటర్లు, 8 మంది ఆర్ ఓ లు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్లు దాఖ లు చేసే విషయంలో అభ్యర్థు లకు అవసరమైన సహకారం అందించాలని, ఏమైనా సందేహాలు ఉంటే సొంత నిర్ణయం తీసుకోకుండా పై అధికారులను సంప్రదించాలని సిబంది కి సూచించారు. నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్క్ తో పాటు పోలీస్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సెన్సేటివ్ లొకేషన్ లు గుర్తించి పూర్తి స్థాయి లో పోలీస్ బందోబస్తూ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



## మీడియా మాధ్యమాల్లో వచ్చే ఎన్నికల వార్తలపై నిఘా ఉంచాలి:

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.
- డీపీఆర్వో కార్యాలయంలో మీడియా సెంటర్ ప్రారంభించిన కలెక్టర్.

**నిర్మల్ జనవరి29( సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మాధ్యమాలలో వచ్చే రాజకీయ వార్తలపై పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేట్ అండ్ మానిటరింగ్ కమిటీ (మీడియా సెంటర్) ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్ తో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. డిపిఆర్ఓ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ కు డిపిఆర్ఓ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోజువారీగా వార్త పత్రికలు, లోకల్ చానళ్లలో వచ్చే వార్తలను ప్రతిరోజు నిశితంగా గమనిస్తూ ఉండాలని అన్నారు. అనుమానిత పెయిడ్ న్యూస్ వివరాలు నమోదు చేయాలని అన్నారు. అన్ని రకాల రిజిస్టర్లను జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు. వివిధ రకాల సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై నిఘా ఉంచాలని తెలిపారు. ఈ మీడియా సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో సీఎం కప్ కార్పొరేషన్ స్థాయి క్రీడలు ప్రారంభం

**ఖమ్మం , జనవరి 29 : ( సమయం న్యూస్ ) :** స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం సీఎం కార్పొరేషన్ స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. మొత్తం మూడు రోజులపాటు కొనసాగేఈ క్రీడలను ,డివైఎస్ఓ సునీల్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పూనుకోలు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్, డిప్యూటీ కమిషనర్ కే. శ్రీనివాస్ రావు, మండల విద్యాశాఖ అధికారిని శైలజలక్ష్మి లు జ్యోతి ప్రజ్వలన చేసి , క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బియ్యని కృష్ణయ్య మాట్లాడుతూ మొదటిరోజు కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడలు ప్రారంభమయ్యాయని , ఇందులో 125 మంది బాలికలు, 327 మంది బాలురు మొత్తం 452 మంది పాల్గొన్నారనీ తెలిపారు. ఈరోజు కబడ్డీ ,కోకో, వాలీబాల్ సెమీఫైనల్స్ ఫైనల్స్ కు చేరుకున్నాయని , ఈ నెల 30న కబడ్డీ ,కోకో ,వాలీబాల్ సెమీఫైనల్స్ , ఫైనల్స్ తో పాటు చెస్ , కరాటే ఈవెంట్స్ జరగనున్నాయని, 31న అథ్లెటిక్స్ , ఫుట్బాల్ క్రీడలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిజాత, లాలయ్య, నాగుల మీద, రాము, రోజా, విజయకుమారి, సంపత్, నాగప్రసాద్, మల్లయ్య నాగరాజు, రజిత, సిఎం కప్ ఇంచార్జ్ ఆదర్శ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జనవరి 29( సమయం న్యూస్) :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారి నుండి స్వీకరించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మీటర్ల నిబంధన అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.



నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భూతగాదాలు లేని మెదక్ జిల్లాగా తీర్చి దిద్దాలి

- పక్కగా భూమి యొక్క నక్ష,మ్యాప్,హద్దుల నిర్ణయం
- పటిష్టంగా భూ రికార్డులు
- భూమి ఆక్రమణలకు తావు లేకుండా భూ భారతి భూ రీసర్వే కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్ జనవరి29( సమయం న్యూస్) :** జిల్లాను భూ తగాదాలు లేనీ జిల్లాగా తీర్చిదిదలని,ప్రతి భూ కమతానికి సరైన నక్షను,మ్యాప్ ను, హద్దులను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం కోసం మెదక్ మండలంలోని పైలెట్ గ్రామపంచాయతీ అయిన పాషాపూర్ లో బుధవారం గ్రామసభ నిర్వహించారు.భూ భారతి చట్టం భూముల రీసర్వే కోసం నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,అదనపు కలెక్టర్ నగేష్, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..భూ భారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం అవుతుందని తెలిపారు.పాషాపూర్ గ్రామంలో భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహించుకోవడనికి గ్రామ సభ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. భూ భారతి భూముల రీసర్వే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతులకు పక్కగా భూ హద్దులు, భూమి యొక్క నక్ష, మ్యాప్ లను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులను తయారు చేయడమే అని అన్నారు. ప్రతి కమతానికి రీసర్వే చేసి రైతులకు భూ తగాదాలు లేకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు. డిజిటల్ సర్వే తో హద్దుల నిర్ణయించి ,అక్షాంశ రేఖాంశాలతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే తో భూ హద్దులు చెరిగి పోకుండా ఉంటాయని, భూమి ఆక్రమణలకు గురి కాకుండా ఉంటుందన్నారు. ఈ రీసర్వే అనంతరం రైతులు భూమిని ఎక్కడకు వెళ్లిన లేదా విదేశాల్లో సైతం తన భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. తర్వాత రోజుల్లో ఈ గ్రామాన్ని నమూనాగా తీసుకొని జిల్లాలోని మరో 23 గ్రామాల్లో భూ భారతి భుముల రీసర్వే చేసి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు.జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న భూములాన్ని రీసర్వే చేసి భూమి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. గ్రామ సర్పంచ్... ప్రజలు, అధికారులు,పాల్గొన్నారు.

# అధిక దిగుబడితోపాటు లాభసాటి పంటలను పండించే విధంగా రైతులకు అవగాహన

● జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అధికారులకు సూచించారు.




**వికారాబాద్, జనవరి,29(సమయం న్యూస్) :** గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో అధిక సాంద్రత పంటల సాగు, నానో యూరియా, డిఎపి వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ రాజేశ్వరి అధికారుల ఉద్దేశించి మాట్లాడుతూ... రైతులకు అధిక లాభాలు వచ్చే విధంగా పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలుకువలను రైతులకు తెలియజేయాలన్నారు.సన్న రకం వరిని సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని, అదేవిధంగా సన్న రకం పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయలు ప్రభుత్వం అందజేస్తున్న విషయాన్ని తెలియజేస్తూ వారిలో అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు.ఎలాంటి వరిని పండిస్తే అధిక లాభాలు వస్తాయో అనే విషయాన్ని కూడా రైతులకు సూచించాలని ఆమె తెలిపారు. రైతులు శాస్త్రవేత్తలు సూచించిన విధంగా పంటలు సాగు చేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం మాట్లాడుతూ.. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రజ్ఞులు రూపొందించిన వివిధ రకాల పంటలు సాగు చేసే విధంగా శాఖ పరంగా దృష్టి సారిస్తామన్నారు.రైతులకు వివిధ కంపెనీల వల్ల నాణ్యమైన విత్తనాలను అందించకపోవడం వల్ల రైతులు మోసపోతున్నారని, రైతులకు ముందస్తుగానే అన్యాయం జరగకుండా సూచనలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల దిగుబడి తక్కువగా వస్తుందని, రైతులందరూ సమయానుకూలంగా నాట్లు వేసే విధంగా రైతులకు సూచించాలన్నారు.సన్న రకాల వరిని పండించడంతోపాటు అధిక దిగుబడి వచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులు ఆయన సూచించారు.ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేశ్వర్ రెడ్డి, రాజా మధు శేఖర్, ఏడిఏలు సందీప్, శంకర్ రాథోడ్, లక్ష్మీ కుమారి, వెంకటేశం, కొమరయ్య, మండల వ్యవసాయ, విస్తరణ అధికారులు విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు

● పరిశీలించిన...డీఎస్పీ నల్లపు లింగయ్య
● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు



**నారాయణపేట, జనవరి,29(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కేంద్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సందర్భంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులకు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... నామినేషన్ కేంద్రం పరిసరాల్లో 163 దీఛీూా (144జతీజూఎ) సెక్షన్ అమల్లో ఉందని, 200 మీటర్ల పరిధిలో గుంపులు గుంపులుగా ఉండరాదని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రానికి అభ్యర్థితో పాటు ఒకరు లేదా ఇద్దరు ప్రతిపాదకులకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.ఎన్నికల నియమావళిని అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, వారి అనుచరులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, మైక్ వినియోగం చేయరాదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నామినేషన్ కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలు అమలు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.మక్తల్ మున్సిపాలిటీ ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని, ఇందుకు ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, గాయత్రి, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# పురపాలక ఎన్నికలలో ముస్లింలకు తగిన ప్రాధాన్యత కల్పించాలి



● ఎం ఏ. సమద్

**ఖమ్మం, జనవరి 29:( సమయం న్యూస్ ) :** రాష్ట్రంలో ప్రస్తుతం 116 మున్సిపాలిటీలు , ఏడు కార్పొరేషన్లకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై , నామినేషన్ల దాఖలు జరుగుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నీ అధికారంలో తీసుకొని వచ్చిన ముస్లిం మైనార్టీలకు ఈ ఎన్నికలలో తగ్గిన ప్రాధాన్యత కల్పించాలని ఖమ్మం జిల్లా పంచాయతీ పరిషత్ ఛైర్మన్ ఎం ఏ సమద్ , గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు ముస్లిం మైనార్టీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకొచ్చే క్రమంలో ఎంతో చేసిన కృషి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు , పార్టీ అధిష్టానానికి తెలిసిన విషయమే అని తెలిపారు. ముస్లిం ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు , మేయర్ లు , మునిసిపాలిటీ ఛైర్మన్ లు గా ముస్లిం మైనార్టీలను ఎంపిక చేయాల్సిన ఆవశ్యకత కాంగ్రెస్ పెద్దలు గమనంలో తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో 2 ,996 వార్డులు ఉండగా ఈ వార్డులలో కూడా ముస్లిం మైనార్టీల జనాభా దామాషను బట్టి సీట్లు కేటాయించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల జనాభా 14% శాతంగా ఉందని అనేక సర్వేలు వెల్లడి చేశాయని , కాబట్టి కనీసం అందులో సగం శాతం ముస్లిం మైనార్టీలకు ఈ పురపాలక ఎన్నికలలో అవకాశం కల్పించాలని తన ప్రకటనలో ఖమ్మం పంచాయతీ పరిషత్ ఛైర్మన్ ఎం ఏ. సమద్ కోరారు.

# కాళేశ్వరం, మిషన్ కాకతీయపై ఎకనామిక్ సర్వే 2026 ప్రశంసలు

**న్యూ డిల్లీ / హైదరాబాద్ జనవరి29( సమయం న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎకనామిక్ సర్వే--2026లోతెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మిషన్ కాకతీయ చెరువుల పునరుద్ధరణ పథకంలను ప్రత్యేకంగా ప్రశంసించింది.ఈ నివేదిక ప్రకారం,2014లో తెలంగాణలో సాగునీరందే భూముల విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలుగా ఉండగా,2023 నాటికి అది 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని వెల్లడించింది.కేవలం తొమ్మిదేళ్ల కాలంలోనే సుమారు 90 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడం ద్వారా కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో చారిత్రాత్మక మార్పు తీసుకువచ్చిందని ఎకనామిక్ సర్వే స్పష్టం చేసింది.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి విస్తరణతో పాటు,మిషన్ కాకతీయ పథకం ద్వారా వేలాది చెరువుల పునరుద్ధరణ జరిగి,గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు రైతులకు స్థిరమైన నీటి భద్రత లభించిందని సర్వే పేర్కొంది.

## మాజీ సి ఎం సిట్ నోటీస్ పై మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ ఖండన.

**హైదరాబాద్ జనవరి 29( సమయం న్యూస్).:** దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన తెచ్చిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గం. ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ తెచ్చినందుకు నోటీసు ఇచ్చారా? అని ప్రశ్నించారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీలను అమలు చేయడం మరిచి డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. ప్రజల కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమం చేసిన నాయకుడిపై ప్రతీకార రాజకీయాలు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆయన పేర్కొన్నారు. పది సంవత్సరాల పాలనలో అద్భుతమైన పథకాలు తీసుకొచ్చి అన్ని వర్గాల ప్రజల అభిమానం పొందిన, గొప్ప పాలనా దక్షుడు కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం ముమ్మాటికీ రాజకీయ కక్షే అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దాటినదని, ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏం మేలు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారికి నోటీలివ్వడం శోచనీయం

● ఎంపీ వద్దిరాజు రవిచంద్ర.

**హైదరాబాద్ జనవరి 29( సమయం న్యూస్,.)** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు రావలసిందిగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని పిలవడం తీవ్ర శోచనీయం.ఇది రాజకీయ కక్ష సాధింపునకు పరాకాష్ట,సిట్ విచారణ టీవీ సీరియల్స్ ను తలపిస్తున్నది. ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల పరిష్కారంలో పాలకులు ఘోరంగా విఫలమై డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.అవినీతిలో కూరుకుపోయి, కుంభకోణాల మయం అయిన రేవంత్ సర్కార్ దిక్కుతోచని స్థితిలో ఉంది.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాక పదేళ్ల తన సుపరిపాలనలో గొప్పగా అభివృద్ధి చేసిన కేసీఆర్ పై చేస్తున్న దుర్మార్గ ప్రచారంలో భాగమే ఈ నోటీసులు. తెలంగాణ యావత్ ప్రజల గుండె చప్పుడు కేసీఆర్ ను టార్గెట్ చేసి ఎలాంటి సంబంధం లేని కేసులో విచారించాలనే కుట్ర దుర్మార్గం.ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థలను దుర్వినియోగం చేసి తమ పార్టీ నాయకులపై విచారణల పేరిట దాడులకు దిగడం తీవ్ర ఆక్షేపణీయం.నాలుగు కోట్ల ప్రజల అభిమాన నాయకులు కేసీఆర్ పై చేస్తున్న నిందారోపణలకు ప్రజలే సరైన సమయంలో సమాధానం చెబుతారు, నోటీసులు,విచారణల పేరుతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు బీఆర్ఎస్ శ్రేణుల పోరాటం ఆగదు. ఎన్ని కుట్రలు, డైవర్షన్లు చేసినా ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలపై తమ ఉద్యమం కొనసాగుతూనే ఉంటుంది.విచారణ జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుంది.-వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు.

# కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**నారాయణపేట, జనవరి,29(సమయం న్యూస్) :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా జిల్లా కలెక్టరేట్ సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్త పట్నాయక్ తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 915428391 3 కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్ కు వచ్చే ఫిర్యాదులను వెంటదివెంట పరిశీలిస్తూ, పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

## అక్రమ ఇసుక రవాణాపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

● 4 ట్రాక్టర్ల సీజ్. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,IPS.



**బషీరాబాద్ మండలం, జనవరి,29(సమయం న్యూస్) :** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశానుసారం బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంతట్టి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు (4) ట్రాక్టర్లను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిబంధనలు అతిక్రమించి ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్న సదరు ట్రాక్టర్లను వెంటనే సీజ్ చేసి, బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు డ్రైవర్లతో పాటు, ట్రాక్టర్ల యజమానులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,IPS మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని జిల్లా ఎస్పీ తెలియజేయడం జరిగింది.

## విద్యతో పాటు క్రీడలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

● బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్.



**పాటాన్ చెరు, జనవరి 29,(సమయం న్యూస్) :** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సెయింట్ జోసెఫ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన వార్షిక క్రీడా దినోత్సవం వేడుకలు ఉత్సాహ భరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ తో కలిసి బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాకుండా జీవితం నేర్పే గొప్ప పాఠశాలలాంటివని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, సహనం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని చెప్పారు. ఆరోగ్యంగా ఉన్న శరీరంలోనే బలమైన ఆలోచనలు పుడతాయని, అందుకే చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గెలుపు ఒక్కరోజు ఆనందాన్ని ఇస్తే, ఓటమి జీవితాంతం ఉపయోగపడే అనుభవాన్ని నేర్పుతుందని ఆయన అన్నారు. ప్రతి పోటీ విద్యార్థులను మరింత బలంగా, ధైర్యంగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనడం ద్వారానే నిజమైన విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ రోజు మైదానంలో అడుగు పెట్టిన ప్రతి విద్యార్థి, విద్యార్థినీ ఇప్పటికే విజేతలేనని ప్రశంసించారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి సాధన చేస్తే అసాధ్యం అనే మాటే ఉండదని అన్నారు. క్రీడలు నాయకత్వ గుణాలు, టీమ్ వర్క్, పరస్పర గౌరవాన్ని అలవర్చడంతో పాటు, భవిష్యత్తులో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చదువులోనూ, ఆటలోనూ సమతుల్యత సాధించినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకమని, ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయిలకే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటగలరని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీజూ నాగేశ్వర రావు గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోసం బాబు గారు, సెల్వన్ ఫాదర్ గారు, వీణ= ఫౌండేషన్ అధ్యక్షులు మధు గారు, ప్రవీణ్ గారు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు వీ= యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ప్రశ్నించే సిపిఎం పార్టీ అభ్యర్థి బండ్ల స్వామి గారిని గెలిపించండి

● 12వ వార్డు సిపిఎం పార్టీ అభ్యర్థిగా బండ్ల స్వామి నామినేషన్ దాఖలు

● కాముని గోపాలస్వామి సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు



**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 29:** ప్రజా సమస్యలపై ప్రశ్నించే సిపిఎం పార్టీ అభ్యర్థి బండ్ల స్వామిని 12వ వార్డులో గెలిపించాలని సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాల స్వామి ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం పార్టీ అభ్యర్థిగా 12వ వార్డు ఈరోజు నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. బండ్ల స్వామి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకొని,ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలో గ్రామ పెద్దలకు నమస్కరించి సహకరించి కోరడం జరిగింది. ఈ సందర్భంగా కాముని గోపాల స్వామి మాట్లాడుతూ ముంపు గ్రామాల సమస్యలపై పోరాడిన చరిత్ర ఎర్ర జెండాకు మాత్రమే ఉన్నదని, సిపిఎం పార్టీ నాయకత్వం తమ్మినేని వీరభద్రం తోపాటు అప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు పోరాటాలు నిర్వహించారని అన్నారు నేటికీ రకాలుగా ముంపు గ్రామాల ప్రజలకు ప్యాకేజీలు రాలేదని, ఇండ్లు ప్లాట్లు రిజిస్ట్రేషన్ కాలేదని అన్నారు. ఒంటరి వృద్ధులు, యువకులకు ప్యాకేజీ అందలేదని అన్నారు. గజ్వేల్ కి వచ్చి సంవత్సరాలు దాటిన స్మశాన వాటిక కూడా లేదని అన్నారు ముంపు బాధితుల పక్షాన ఎర్రజెండా మాత్రమే పోరాడుతున్నాదని అన్నారు. కావున 12వ వార్డులో సుత్తి కొడవలి చుక్క గుర్తు ఓటు వేసి సిపిఎం పార్టీ అభ్యర్థి బండ్ల స్వామిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య, అభ్యర్థి బండ్ల స్వామి, మండల కార్యదర్శి రంగారెడ్డి, స్వామి నాగరాజు మల్లేష్ క్రాంతి రవి రాజులు శ్రీనివాస్ ప్రవీణ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# పలు శాఖల అమలు తీరును సమీక్షించిన సి ఎస్ కే రామకృష్ణ రావు.



**హైదరాబాద్, జనవరి 29( సమయం న్యూస్)** గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావు, ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ , ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఇంధన శాఖ:** ఈ సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టిజి ట్రాన్స్‌కో, టిజి జెన్‌కో, టిజి ఎస్‌పిడిసిఎల్, టిజి ఎన్‌పిడిసిఎల్ విభాగాలలో కొనసాగుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతి, అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సి.ఎస్ ఆదేశించారు. అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో విద్యుత్ రంగంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి మన రాష్ట్రంలో కూడా వివిధ డిస్కంలలో అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంవిలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిపై సి.ఎస్ కు వివరించారు. ఇ-గవర్నెన్స్, తదితర అంశాలు, అండర్ గ్రౌండ్ కేబులింగ్, విజన్ 2047 లక్ష్యాలు, గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు ప్రతిపాదించిన చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్ నగర్, పరిగి లో విద్యుత్ సబ్ స్టేషన్ల పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు.

**వైద్య ఆరోగ్య శాఖ:** రాష్ట్రంలో వరంగల్, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, న్యూ ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాలలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల సరఫరా, వైద్య శాఖలో నర్సింగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్ఎస్ పథకం, వైద్య పరికరాల సరఫరా తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సి.ఎస్ ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ, దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, పథకాల అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న సి.ఎస్, లక్ష్యాల సాధనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మాతా--శిశు ఆరోగ్యం, సంక్రమణ రోగాల నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగులకు సౌకర్యాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జి.హెచ్.యం.సి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. నూతన ఆసుపత్రుల అవసరాలకు మేరకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు.

**ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి:** ఈ సమావేశంలో ఐటీఈ & సీ శాఖలో ప్రస్తుత కార్యకలాపాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, ఈ-గవర్నెన్స్ సేవల విస్తరణ, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రంలో ఉన్న 12,751 గ్రామ పంచాయతీలలో టి ఫైబర్ విస్తరణ పై సమీక్ష చేశారు .రాష్ట్రాన్ని ఐటీ రంగంలో మరింత పోటీగా నిలిపే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించే దిశగా చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఐటీ సేవలను ప్రజలకు సులబతరంగా అందించేందుకు ఒక WhatsApp రూపొందించాలని, మీసేవ కేంద్రాలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో వీలైనంత మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో టి-ఫైబర్ విస్తరణకు తగు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మైన్స్ శాఖలో ఇసుక సరఫరా పై సాండ్ రీచ్ లలో ఏర్పాటు చేసిన సి.సి.టీవీల ఏర్పాటు, ఇటీవల కాలంలో చేపట్టిన సంస్కరణలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. భారత ఫ్యూచర్ సిటీ, టిజి ఐఐసి చేపట్టిన పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ విభాగాలలో చేపట్టిన ప్రాజెక్టలపై సి.ఎస్ సమీక్షించారు. గత మూడు రోజులుగా ఇప్పటి వరకు (13) విభాగాలను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాబోయే రెండు రోజులలో మిగతా విభాగాల సమీక్షకు సిద్ధమవుతున్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, నవీన్ మిట్టల్, మైన్స్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, హెచ్ యం.డి.ఎ. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె.శ్రీదేవి, టిజి ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, టిజి ఎస్పిడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, టిజి ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ యం.డి. ఆశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# యువత చేతుల్లో స్మార్ట్ ఫోన్ .. దారి చూపితే భవిష్యత్ వెలుగు

### గ్రామీణ యువతకు మార్గనిర్దేశం అవసరం.




డిజిటల్ యుగం యువతకు అపారమైన అవకాశాలు అందిస్తోంది. ఒకప్పుడు పుస్తకాలు,ఉపాధ్యాయులు, గ్రంథాలయాలకే పరిమితమైన విజ్ఞానం నేడు ఒక చిన్న స్మార్ట్‌ఫోన్‌లో అందుబాటులో ఉంది. కానీ అదే స్మార్ట్‌ఫోన్ యువత చేతుల్లో దారి చూపే దీపంగా కాకుండా, చెడుదారిలోకి నెట్టే సాధనంగా మారుతోందన్న ఆందోళనకర పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఓ సర్వే ఈ వాస్తవాన్ని పరోక్షంగా బయటపెట్టింది. చదువు,ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి ఉపయోగించాల్సిన సమయాన్ని యువత ఎక్కువగా సోషల్ మీడియా,వినోదాత్మక వీడియోలు,అర్థం లేని చాటింగ్‌లకు ఖర్చు చేస్తోందని సర్వే పేర్కొంది. అయితే ఈ పరిస్థితిని కేవలం విమర్శలతో వదిలేయకుండా, యువతను సరైన దిశలో నడిపించే మార్గాలను చూపాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం బలపడుతోంది. గ్రామీణ యువతలో ఉత్సాహం, శక్తి, సృజనాత్మకత కొదవలేదు. సరైన మార్గనిర్దేశం లభిస్తే అదే యువత గ్రామాల అభివృద్ధికి, దేశ ప్రగతికి దోహదపడగలదు. స్మార్ట్‌ఫోన్‌ను కేవలం వినోదానికి మాత్రమే కాకుండా... ఆన్‌లైన్ చదువులు, పోటీ పరీక్షల సమాచారం, నైపుణ్య శిక్షణ, వ్యవసాయ సాంకేతికత, చిన్న వ్యాపార అవకాశాల కోసం వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలి. పిల్లలపై ఆంక్షలు విధించడం కంటే, ఫోన్‌ను ఎలా ఉపయోగించాలో నేర్పించడం ముఖ్యం. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు యువతతో చర్చలు నిర్వహిస్తూ, డిజిటల్ విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునే మార్గాలను చూపించాలి. ప్రభుత్వ స్థాయిలో గ్రామాల్లో డిజిటల్ అవగాహన శిబిరాలు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. యువతకు అవసరమైంది నిషేధం కాదు... దిశ. స్మార్ట్‌ఫోన్‌ను చెడుదారి చూపించే సాధనంగా కాకుండా, భవిష్యత్తును నిర్మించే ఆయుధంగా మార్చుకోవడమే ఈ కాలానికి సరైన మార్గం. గ్రామాల్లో యువత సరైన దారిలో నడిస్తే... డిజిటల్ యుగం నిజమైన విజ్ఞాన యుగంగా మారుతుందన్న ఆశను బలంగా వినిపిస్తోంది.




## సకాట సీడ్స్ వారి స్వీట్ కార్న్‌పై అవగాహన సదస్సు

**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 29 :** గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం ఇప్పలగూడెం గ్రామంలో గురువారం రోజున సకాట సీడ్స్ వారి స్వీట్ కార్న్ స్వీట్ క్వీన్ 0174 పైన శ్రీ పరమేశ్వర్ రెడ్డి వ్యవసాయ పొలంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. సకాట కంపెనీ ప్రతినిధి సంపత్ కుమార్ మాట్లాడుతూ,సకాట సీడ్స్ వారి స్వీట్ క్వీన్ 0174 అనురకం 80 నుంచి 85 రోజులలో కోతకు వచ్చి 600 గ్రాముల నుంచి 700 గ్రాముల వరకు వస్తుందని,ఈ స్వీట్ క్వీన్ 0174 అనురకం సంవత్సరం పొడువున విత్తుకోవచ్చని పేర్కొన్నారు. రైతు పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సకాట సీడ్స్ వారి స్వీట్ క్వీన్ తక్కువ కాలంలో కోతకు వచ్చి మంచి ఆకుపచ్చ ఆకారం కలిగి,మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ రకంలో 60 శాతం వరకు రెండు కంకులు కలిగిఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిబిల్ అగ్రి సైన్సెస్ టీమ్ తరపున రమణ రెడ్డి మరియు చుట్టు పక్కల గ్రామ రైతులు పాల్గొన్నారు..




## 11వ వార్డు అభ్యర్థి గా ఇందూర్ రాములు నామినేషన్ దాఖలు

**తాండూరు మున్సిపల్, జనవరి,29(సమయం న్యూస్ :** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు బిజెపి పార్టీ గా అభ్యర్థిగా ఇందూర్ రాములు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ బిజెపి పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని అన్నారు. మున్సిపల్ పై బిజెపి జెండా ఎగరవేస్తాం ప్రజల సహకారంతో వార్డు, అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

# "ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దుతా"

## సర్పంచ్ స్వాతి మాణిక్యం గౌడ్ ,



**చేవెళ్ల, షాబాద్,జనవరి: 29: (సమయం న్యూస్) :** తల్లపల్లి: నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్ మొదటి గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలన్నదే నా ఆశయం అని అన్నారు.

గ్రామంలో ఎన్నో రోజులుగా పరిష్కారం కానీ సమస్యలను గుర్తించి పూర్తి చేస్తామని సెక్రెటరీ తెలిపారు. వీధి దీపాలు, వాటర్ లీకేజీలు, డ్రైనేజీలు, రోడ్డు మరమ్మతులు చేశామని చెప్పారు.ఆరోగ్య కేంద్రం శిథిలా వస్థలో ఉందని, దాన్ని పూర్తిగా మరమ్మత్తులు చేయించాలని గ్రామస్తులు కోరారు. సీసీ కెమెరాలు 24 గంటలు పర్యవేక్షణలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఉపాధి హామీ పథకం కింద ఆవులకు షెడ్లు ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ పశువుల గోపాల్ అన్నారు.వెల్స్పున్ కంపెనీ(శ్వేత) వారు గ్రామంలోని మహిళలకు వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చి, వారికి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి, వారిని సొంతంగా వ్యాపారం చేసుకునే లాగా మహిళలను ప్రోత్సహిస్తామని తెలిపారు.గ్రామంలో విద్యుత్ సంబంధిత సమస్యలు ఏవి ఉన్నా అతి త్వరలో పూర్తి చేస్తామని లైన్మెన్ అర్జున్ అన్నారు.గ్రామస్తులు అందరూ తలపల్లి నాగర్ కూడా గ్రామ పరిధి వివాదంలో ఉన్నందున, గ్రామస్తులు ఆ పరిసరాల్లో ఆ పరిధిలో ఉండే ఇంటి బిల్లులు గానీ, కొత్తగా ఇంటి నిర్మాణానికి సంబంధించిన పర్మిషన్లు గానీ ఇవ్వరాదని సెక్రెటరీ అజీమ్ కు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అక్కముల ఆంజనేయులు, వార్డు సభ్యులు, దోస్వాడ రాజు, బొబ్బని నవనీత ప్రకాష్, ఆశగారి లక్ష్మి మల్లేష్, తమ్మలి జయమ్మ బాలరాజ్, మేకల శ్రావణ్,పానుగంటి కృష్ణవేణి పాండు, గ్రామ సంఘం సభ్యులు, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, ఆశిగారి బాలరాజు, అక్కముళ్ల జంగయ్య, గడ్డమీద లక్ష్మయ్య, నాగని బాలయ్య, బండ రామచంద్రయ్య గౌడ్, వడ్ల పురుషోత్తం, దయాకర్, నరేశ్, కుమ్మరి సత్తయ్య ,మేకల మల్లేష్, సమ్మీ కృష్ణయ్య, మేకల కృష్ణ, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

## కోస్గి,మద్దూర్ నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ సిక్త పట్నాయక్..



**మద్దూర్, కోస్గి మున్సిపల్, జనవరి,29(సమయం న్యూస్)** నారాయణపేట జిల్లా లోని కోస్గిమద్దూర్ మున్సిపాలిటీలలో నామినేషన్ల ప్రక్రియ ను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. గురువారం ఆయా మున్సిపాలిటీలలో నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో దాఖలు అయ్యే అవకాశం ఉందని, అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. కలెక్టర్ జిల్లాలోని మద్దూరు, కోస్గి మున్సిపాల్టీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా కేంద్రాల్లోని ఆర్వోలకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉప సంహరణ ప్రక్రియలకు సంబంధించి సలహాలు, సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్ ద్వారా అభ్యర్థులకు ఉన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేయాలన్నారు. కేంద్రాల్లో నామినేషన్ల పత్రాలను తెలుగు తో పాటు ఇంగ్లీష్ బాషలో ఉన్నవి కూడా అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని వార్డుల ఓటరు జాబితాలను ఉంచుకోవాలన్నారు. తొలి రోజు ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయని ఆర్ వో లను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన నామినేషన్లను ఎప్పటికప్పుడు స్కాన్ చేసి టీ పోల్ అప్ లోడ్ చేయించాలని కమిషనర్ల ను ఆదేశించారు. ఫ్రీ స్క్రూటినీ, హెల్ప్ డెస్క్, నో డివ్ సర్టిఫికేట్ సెంటర్ ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా మున్సిపాలిటీ లకు వంద మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపి అభ్యర్థులు వచ్చేలా పోలీసులు భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నామినేషన్ వేసే అభ్యర్థి వెంట ఒక ప్రతిపాదకుడు, ఒక సాక్షి మొత్తం ముగ్గురికి మాత్రమే కేంద్రం లోపలికి అనుమతించాలని కమిషనర్లకు సూచించారు. కోస్గి మున్సిపాలిటీ పై అంతస్తు భవనంలో భద్ర పరిచిన బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని రకాల పత్రాలను కలెక్టర్ పరిశీలించారు. కోస్గి లో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ ల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీల కమిషనర్లు శ్రీకాంత్, నాగరాజు, మేనేజర్లు, ఇంజనీర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# షాబాద్ మండలంలో కుల వివక్ష దళితుల బోనాలను అడ్డుకున్న బీసీలు



**చేవెళ్ల, షాబాద్:జనవరి '29:( సమయం న్యూస్) :** రంగారెడ్డి జిల్లా, షాబాద్: నాగర్గూడ గ్రామంలో కుల వివక్ష మరోసారి పడగ విప్పింది. అమ్మవారికి బోనాలు సమర్పించే క్రమంలో దళితులకు, బీసీ సామాజిక వర్గానికి మధ్య నెలకొన్న వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. మనుషులంతా ఒక్కటే అని చాటిచెప్పే పండుగ పూట ఇటువంటి వివక్షా పూరిత ఘటన జరగడం స్థానికంగా కలకలం రేపింది.

అసలేం జరిగింది? ..గ్రామంలోని పోచమ్మ ఆలయానికి బోనాలతో వెళ్లడానికి దారి నీ బీసీ సామాజిక వర్గానికి చెందిన కొందరు వారిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. "మీ బోనాలు, మా బోనాలు కలవకూడదు.. మీరు వేరు, మేము వేరు" అంటూ దళితుల పట్ల వివక్షా పూరిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై దళిత యువకులు మరియు మహిళలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. "అందరం అన్నదమ్ములమే.. నీ ఒంట్లో పారేది రక్తమే, నా ఒంట్లో పారేదీ రక్తమే" అని ఆవేదన వ్యక్తం చేస్తూ సమానత్వం గురించి నిలదీశారు.

రంగంలోకి దళిత సంఘాలు ...ఈ విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ మండల ప్రెసిడెంట్ అక్కమొల్ల జంగయ్య, తాళ్లపల్లి గ్రామ ఉప సర్పంచ్ అక్కమొల్ల ఆంజనేయులు, మరియు తాళ్లపల్లి అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు మారుగల్ల నర్సింలు, సమ్మీ కిష్టయ్య మరియు నాగర్ గూడ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు బేగరి పెంటయ్య, బేగరి దుర్గేష్, బేగరి యాదయ్య, బేగరి శివకుమార్ , బేగరి మహిపాల్ , బేగరి క్రాంతి కుమార్, ఇతరులు వెంటనే గ్రామానికి చేరుకున్నారు. వివక్షకు వ్యతిరేకంగా గళం ఎత్తిన నాయకులు, బాధితులకు అండగా నిలిచారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ...ఈ అమానవీయ ఘటనపై దళిత యువకులు, సంఘం నాయకులతో కలిసి షాబాద్ మండల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని, వివక్షకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి/అధికారులకు విన్నపం ...భవిష్యత్తులో ఇటువంటి ఘర్షణలు తలెత్తకుండా ఉండటానికి మరియు దళితులు ప్రశాంతంగా అమ్మవారికి బోనాలు అర్పించుకోవడానికి:దళిత సామాజిక వర్గం వారు ఆలయానికి వెళ్లడానికి ప్రత్యేకంగా మరియు అనుకూలంగా ఉండే కొత్త దారిని ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

# రుద్రారం గ్రామసభ: అభివృద్ధే లక్ష్యం

- సర్పంచ్ గొల్ల గూడెం యాది రెడ్డి




**చేవెళ్ల,షాబాద్, జనవరి: 29.( సమయం న్యూస్) :** షాబాద్ మండలం రుద్రారం గ్రామంలో గురువారం నూతన సర్పంచ్ గొల్ల గూడెం యాది రెడ్డి గారు, ఉప సర్పంచ్ కుర్వ యాదమ్మ, పంచాయతీ సెక్రెటరీ, నరేందర్, వార్డ్ మెంబర్ల సమక్షంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది.సర్పంచ్ గారు గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అంగన్వాడీ, ఆశవర్కర్, వాటర్ మాన్, పారిశుధ్య కార్మికులకు, వారి వారి పనులను శ్రద్ధగా నిర్వహించాలని సూచించారు.గ్రామ అభివృద్ధిలో మీరందరు భాగస్వాములు కావాలని ఎవ్వరికి ఏ సమస్య వచ్చిన పరిష్కరించాలని, మురుగు కాలువలు, తడి, పొడి చెత్తను వేరు చేయాలనీ తెలియజేశారు.రుద్రారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని అన్నారు.

### SC కాలనిలో నూతన కమ్యూనిటీ భవనంకు భూమి పూజ

ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ గ్రామ అధ్యక్షులు అల్లవాడ సుదర్శన్, వార్డ్ మెంబర్లు, మాజీ వార్డ్ మెంబర్ బండ క్రిష్ణ, యువనాయకులు గుర్రాల క్రిష్ణ రెడ్డి, రాజన్న గారి మహేందర్ రెడ్డి, బండి చంద్రశేఖర్, బండి ప్రభాకర్, అల్లవాడ మల్లేష్, చెవిటి దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజలకు నీటి కష్టాలు తీర్చడమే లక్ష్యం.

## దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు.



**యాలాల మండలం, జనవరి,29(సమయం న్యూస్) :** రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టు కొని గ్రామ వ ప్రజలకు నీటి కష్టాలు తీర్చడమే లక్ష్యమ నిదేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు పేర్కొన్నారు. గురువారం యాలాల మండలం దేవనూర్ గ్రామంలోని రెండో (2)వ వార్డులో వార్డు ప్రజలకు నీటి కష్టాలు ఏర్పడ్డాయి. దీంతో వెంటనే స్పందించినదేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావుబోరు బావికి మోటార్ బిగించి వార్డు ప్రజలకు నీటి కష్టాలు తొలగించారు. దింతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావుప్రజా సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

# 2వ వార్డు అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన వాణిశ్రీ మధు సుధన్ యాదవ్



**కొడంగల్ మున్సిపల్, జనవరి,29(సమయం న్యూస్) :** కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ అభ్యర్థి ఆర్ వాణిశ్రీ మధు సుధన్ యాదవ్ నామినేషన్ కార్యక్రమం వారి నివాసం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి కొడంగల్ పట్టణ కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో పూజలు చేసి భారీ ర్యాలీ గా బయలుదేరి కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కొడంగల్ మున్సిపల్ ఇంచార్జ్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గట్టు రామచంద్ర రావు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది.

# యూరియా బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలి

---- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.



**మద్దూరు మున్సిపల్, జనవరి,29(సమయం న్యూస్) :** యూరియా బుకింగ్ యాప్ పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టర్ మద్దూరు పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్, కోస్గి పట్టణంలోని పీ ఏ సీ ఎస్ ను సందర్శించారు.యూరియా బుకింగ్ యాప్ పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు యూరియా ఎలా బుక్ చేసుకోవాలి, డీలర్లు ఎలా సేల్స్ కన్ఫర్మేషన్ చేయాలి అనే అంశాలపై రైతులు,,డీలర్లకు అవగాహన కల్పించారు. యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు సులభంగా యూరియా బుక్ చేసుకోవచ్చని, ఎరువుల అమ్మకాల్లో పారదర్శకత తీసుకురావడానికి ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు.డీలర్లు, ఆగ్రోస్, పీ ఏ సీ ఎస్ నిర్వాహకులు అందరూ ఆన్ లైన్ ఎరువుల అమ్మకాల విధానంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే నారాయణపేట జిల్లా మరియు కోస్గి డివిజన్ పరిధిలో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఏ.డీ.ఏ రామకృష్ణ, డీలర్లు,ఆగ్రోస్, పీ ఏ సీ ఎస్ ప్రతినిధులు,సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# 19వ వార్డుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జుంటుపల్లి వెంకట్ నామినేషన్ దాఖలు




**తాండూర్ మున్సిపల్, జనవరి,29(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని 19వ వార్డుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జుంటుపల్లి వెంకట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని అన్నారు. మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో వార్డు, అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

- అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు ఎస్సై విఠల్ రెడ్డి




**యాలాల మండలం, జనవరి,29(సమయం న్యూస్) :** నమ్మదగిన సమాచారం మేరకు అగ్గనూరు శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మహేంద్ర ట్రాక్టర్ ను యాలాల పోలీసులు పట్టుకోవడం జరిగింది, అదే సమయంలో ట్రాక్టర్ యొక్క డ్రైవర్ అక్కడి నుండి పారిపోవడం జరిగింది. అట్టి ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కి తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు. ఎవరైనా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# పరిగి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం

● పాల్గొన్న ఎమ్మెల్యే డా.టి. రామ్మోహన్ రెడ్డి



**పరిగి మున్సిపల్, జనవరి,29(సమయం న్యూస్) :** పరిగి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో కలిసి నామినేషన్ పత్రాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరిగి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ జెండాను మున్సిపాలిటీలో ఎగరేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ప్రజా పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, పరిగి మున్సిపాలిటీలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. అలాగే, పరిగి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే పార్టీ గెలుపుకు బలమైన పునాదులు అని తెలిపారు.

# తాండూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కి షాక్..



**మున్సిపల్, జనవరి,29(సమయం న్యూస్) :** బీఆర్ఎస్ పార్ట్ లో చేరిన 3 వ వార్డు మాజీ కౌన్సిలర్ భీమ్ సింగ్, మరియు పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు.. బొబ్బి కృష్ణ. సూరి నాయక్ లకుగులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పైలెట్ రోహిత్ రెడ్డి

# అభివృద్ధే లక్ష్యం: ఎండి జాహేద్



**చేవెళ్ల, జనవరి.29:(సమయం న్యూస్) :** చేవెళ్ల మున్సిపల్ 11వ వార్డు (ఇబ్రహీంపల్లి) నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎండి జాహిద్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రజల సేవే తన మార్గమని, వార్డు సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదు-పాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలతో కలిసి 11వ వార్డుని అభి వృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు. తనను కుటుంబ సభ్యుడిగా భావిం చి ఆశీర్వదించాలని కోరుతూ, ప్రజలు ఉంచే నమ్మకాన్ని ఎప్పటికీ వృథా చేయనని తెలిపారు.

# వైన్ షాప్ ను ఆకస్మిక తనిఖీ చేసిన నారాయణపేట ఎక్సైజ్ అధికారులు



**కృష్ణ మండలం, జనవరి,29(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని గురురాఘవేంద్ర వైన్ షాప్‌నుఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ సందర్భంగా షాప్‌లో నిల్వ ఉన్న మొత్తం మద్యం స్టాక్‌ను సవివరంగా పరిశీలించగా, ఎటువంటి కల్తీ మద్యం లేదని నిర్ధారించబడింది. నిన్న కొంతమంది వ్యక్తులు ఒక కార్టన్ బీరు కొనుగోలు చేసి తీసుకెళ్లిన అనంతరం, అందులోని రెండు బీర్ బాటిళ్లలో కల్తీ జరిగిందని ఆరోపిస్తూ సాయంత్రం సమయంలో వైన్ షాప్ వద్దకు వచ్చారు. ఈ విషయాన్ని గమనించి, ఎస్సై శిరీషా ఆధ్వర్యంలో సంబంధిత వైన్ షాప్‌లో ఉన్న మొత్తం స్టాక్‌పై పూర్తిస్థాయి తనిఖీ నిర్వహించబడింది. నిర్వహించిన తనిఖీలలో ఎక్కడా కల్తీ జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేదా ఆనవాళ్లు లభించలేదు. వైన్ షాప్‌లలో కల్తీ మద్యం విక్రయానికి అనుమతి లేదు. ఒకవేళ కల్తీ మద్యం విక్రయించినట్లు నిర్ధారణ అయినట్లయితే, సంబంధిత వైన్ షాప్ లైసెన్స్‌ను రద్దు చేసి, నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది...

# అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ర్యాలీలో ఎంపీ ఈటల రాజేందర్



**అలియాబాద్: జనవరి29( సమయం న్యూస్) :** డబ్బులు, మద్యం మీద ఆధారపడి రాజకీయాలు నడిపితే తమలాంటి వారు రాజకీయాల్లో ఉండే అవకాశం ఉండదని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. “నన్ను కోసినా ఒక్క రూపాయి లేదని ముఖ్యమంత్రి స్వయంగా చెబుతున్నప్పుడు, అటువంటి ప్రభుత్వం ప్రజలకు ఏం అభివృద్ధి చేస్తుంది?” అని ఆయన ప్రశ్నించారు. అలియాబాద్ బీజేపీ అడ్డా అని పేర్కొన్న ఈటల, సర్పంచులు, ఎంపీటీసీలను గెలిపించుకున్న చరిత్ర ఈ ప్రాంతానికి ఉందన్నారు. 1992 నుంచి 2002 వరకు తాను అలియాబాద్‌లో నివసించానని గుర్తు చేశారు. బీజేపీకి నాలుగు లక్షల మెజారిటీ ఇచ్చి చరిత్ర సృష్టించిన నియోజకవర్గం మల్కాజిగిరి అని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ రూపురేఖలు మారాయని తెలిపారు. భారతజాతి ప్రతిష్ట అంతర్జాతీయంగా పెరిగిందన్నారు. ప్రతి పేదవాడికి నెలకు ఐదు కిలోల బియ్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపిస్తున్నారని, గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధికి ఖర్చవుతున్న ప్రతి రూపాయి కేంద్ర ప్రభుత్వ నిధులేనని స్పష్టం చేశారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని, పెన్షన్లు పెంచకపోవడం, కొత్త పెన్షన్లు ఇవ్వకపోవడం జరుగుతోందని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కేసీఆర్ కూడా ఇవ్వలేదని, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. “గెలిచినం తప్ప మా చేతిలో ఒక్క రూపాయి లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చెబుతున్నారు. మళ్లీ వారిని గెలిపించినా ప్రజలకు ఒరిగేదేమీ లేదు” అని అన్నారు. కేవలం బీజేపీ మాత్రమే కేంద్రం నుంచి నిధులు తీసుకురాగలదని, స్మార్ట్ సిటీల పేరుతో అభివృద్ధి నిధులు తీసుకువచ్చే శక్తి బీజేపీకే ఉందన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ అన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే జరుగుతున్నాయని తెలిపారు.

కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ధరణి వ్యవస్థ ద్వారా లక్షలాది మంది రైతుల భూములు గల్లంతయ్యాయని, పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. భూ భారతి కూడా సమస్యలకు పరిష్కారం కాదన్నారు. పేదల ఇళ్లను కూల్చే చర్యలను భారతీయ జనతా పార్టీ అడ్డుకుందని, భూ మాఫియాకు పెద్దల అండదండలు ఉన్నాయని అన్నారు. డబ్బులతో ప్రజల ఆత్మగౌరవాన్ని కొనుగోలు చేసే రాజకీయాలు తమవి కావని స్పష్టం చేశారు. అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కు అందరికీ సమానమని, డబ్బులు తీసుకుని ఓటు వేస్తారని ప్రజలను అవమానించడం తగదన్నారు. ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని, ప్రజలకు నోట్లో నాలుకలా ఉండి పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ అభివృద్ధి బాధ్యత తమకు అప్పగిస్తే, ప్రజలు గర్వపడేలా పనులు చేసి చూపిస్తామని ఈటల రాజేందర్ తెలిపారు.

# ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట, జనవరి,29(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలోని మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ లో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎన్నికల కౌంటింగ్ కి సంబంధించిన కౌంటింగ్ సూపర్ వైజర్లు,సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. పోలింగ్ ముగిసిన తర్వాత భద్రపరిచినటువంటి బ్యాలెట్ బాక్స్ లను అన్ సీల్ చేసి కౌంటింగ్ ప్రక్రియ ఏ విధంగా నిర్వహించాలనే విషయాలపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.... వ్యాలిడ్ ఓట్లు,ఇన్ వ్యాలిడ్ ఓట్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని అభ్యర్థులకు కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా అర్థమయ్యేలా చేపట్టాలని సూచించారు. కౌంటింగ్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌంటింగ్ నియమ నిబంధనల గురించి మాస్టర్ ట్రైనర్లు చెప్పిన అంశాలను గుర్తు పెట్టుకుని ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి చిన్న పొరపాటు జరగకుండా కౌంటింగ్ ను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పాల్గొన్నారు.

# కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ జనవరి29( సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎవరైనా 9100577132 నంబర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి ఫోన్ కాల్‌ను సిబ్బంది స్వీకరించాలని, ఫిర్యాదుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఈడీఎం నదీమ్, కంట్రోల్ రూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలుర) ను ఆకస్మిక తనిఖీ

**దేవరకద్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలుర) ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి.**



**దేవరకద్ర జనవరి29( సమయం న్యూస్).:** పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎస్ ఎస్ సి విద్యార్థులు ఆత్మవిశ్వాసం తో కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం దేవరకద్ర మండల కేంద్రంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలుర)ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఎస్ ఎస్ సి పరీక్షలు సమీపిస్తున్న నేపద్యంలో విద్యార్థులు ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసం కష్టపడి చదవాలని, చదువును నిర్లక్ష్యం చేయ వద్దని సూచించారు విద్యార్థులకు అందుతున్న వసతులు, బోధన విధానం తదితర అంశాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ , పదవ తరగతి విద్యార్థుల ఎ , బి సెక్షన్ తరగతి గదులను సందర్శించి బోధన ప్రక్రియను గమనించారు. అనంతరం ఇంటర్మీడియట్ ఎం.పి.సి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారు ప్రస్తుతం ఏ అంశాలు చదువుతున్నారు, ప్రాక్టికల్ ల్యాబ్ తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా, ఇంటర్మీడియట్ పూర్తయ్యాక భవిష్యత్తులో ఏమి చేయాలనుకుంటున్నారు అనే విషయాలపై పలు ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నిరంతరం కెరీర్ కౌన్సిలింగ్ అందిస్తున్నారా అనే అంశంపై ఉపాధ్యాయులను ప్రశ్నించిన కలెక్టర్, విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాల సాధనలో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా చదువును మాత్రం ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దని, విద్యే వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని సూచించారు. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే అంశంపై కూడా విద్యార్థులను ప్రశ్నించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి భయం లేదా ఆందోళనకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో చదవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని, ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పిల్లలకు పరిశుభ్రమైన, పోషక విలువలు గల, రుచికరమైన ఆహారం అందేలా వంట సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

# బంగ్లాదేశ్ 'యూటర్న్'

## షూటింగ్ టీమ్‌కు భారత్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్!

క్రికెట్ టీమ్ వద్దు.. షూటర్లు ముద్దు: బంగ్లా ప్రభుత్వం ద్వంద్వ నీతి

టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకొని.. ఇప్పుడు ఢిల్లీకి షూటింగ్ జట్టు

పాక్ మాటలు నమ్మి భద్రత సాకుతో వెనక్కి.. ఇప్పుడు భద్రత ఉందట!




**న్యూఢిల్లీ, జనవరి 29:** 'ఆకు వచ్చి ముల్లు మీద పడ్డా.. ముల్లు వచ్చి ఆకు మీద పడ్డా చిరిగేది ఆకే' అన్న సామెత ప్రస్తుతం బంగ్లాదేశ్ ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. భారత్‌లో భద్రతా కారణాలు చూపుతూ క్రికెట్ టీ20 ప్రపంచకప్ నుంచే తప్పుకున్న బంగ్లాదేశ్, ఇప్పుడు అనూహ్యంగా తన షూటింగ్ జట్టును భారత్‌కు పంపేందుకు అనుమతినిచ్చింది. ఫిబ్రవరి 2 నుంచి న్యూఢిల్లీలో ప్రారంభం కానున్న ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఇద్దరు సభ్యులతో కూడిన బంగ్లా బృందానికి ఆ దేశ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### క్రికెట్‌కు ఒక నీతి.. షూటింగ్‌కు ఒక నీతా?

ఫిబ్రవరిలో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకున్న సంగతి తెలిసిందే. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలన్న విన్నపాన్ని ఐసీసీ తోసిపుచ్చడంతో, భద్రత లేదంటూ బంగ్లా అలిగింది. అయితే, షూటర్ల విషయంలో మాత్రం బంగ్లా స్పోర్ట్స్ సెక్రటరీ మెహబూబ్ ఉల్ ఆలం వింత వాదన వినిపించారు. షూటింగ్ ఇండోర్ గేమ్ అని, ప్రేక్షకులు తక్కువగా ఉంటారు కాబట్టి భద్రతకు ముప్పు లేదని వ్యాఖ్యానించారు. దీనిపై క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. పాకిస్థాన్ మాటలు విని భారత్‌తో కయ్యానికి దిగిన బంగ్లాకు, అంతర్జాతీయ పోటీల ప్రాముఖ్యత గుర్తొచ్చి ఇప్పుడు మెత్తబడినట్లు కనిపిస్తోంది.

### భారత్ నుంచి పూర్తి భద్రత..

బంగ్లా షూటింగ్ బృందం జనవరి 31న ఢిల్లీకి చేరుకుంటుందని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ పవన్ సింగ్ ధృవీకరించారు. భారత విదేశీ మరియు క్రీడల మంత్రిత్వ శాఖల నుంచి ఇప్పటికే అనుమతులు లభించాయని తెలిపారు. క్రికెట్ విషయంలో ముస్తాఫిజుర్ రెహమాన్ ఐపీఎల్ విడుదల అంశాన్ని సాకుగా చూపి రాద్ధాంతం చేసిన బంగ్లా, ఇప్పుడు షూటర్లను పంపడం ద్వారా తన వైఖరిలోని లోపాలను బయటపెట్టుకుంది.



# సబలెంకా వర్సెస్ స్విటోలినా!

## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 'పొలిటికల్' సెగ..

నో షేక్ హ్యాండ్.. నో ఫోటో.. కోర్టులో భారత్-పాక్ తరహా ఉద్రిక్తత

అంపైర్‌తో సబలెంకా వాగ్వాదం.. 'హిండ్రెన్స్' కాల్‌తో పాయింట్ కట్

వరుసగా 4వ సారి ఫైనల్‌కు సబలెంకా.. మార్టినా హింగిస్ రికార్డు సమం!

**మెల్బోర్న్, జనవరి 29:** ఆస్ట్రేలియన్ ఓపెన్ వేదికగా గురువారం జరిగిన మహిళల సెంగిల్స్ సెమీఫైనల్ పోరు క్రీడా స్ఫూర్తి కంటే రాజకీయ ఉద్రిక్తతలకే వేదికైంది. వరల్డ్ నంబర్-1, బెలారస్ స్టార్ అరీనా సబలెంకా, ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలినా స్విటోలినా మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో కనీసం 'హ్యాండ్‌షేక్' కూడా ఇచ్చుకోకపోవడం క్రీడా ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ ప్లేయర్లతో చేతులు కలపకూడదనే ఉక్రెయిన్ క్రీడాకారుల నిర్ణయాన్ని స్విటోలినా ఇక్కడ కూడా కొనసాగించారు.

### కోర్టులో 'హిండ్రెన్స్' వివాదం

మ్యాచ్ ఆరంభానికి ముందు ఫోటోలకు కూడా ఇద్దరూ కలిసి నిలబడలేదు. ఇక మ్యాచ్ జరుగుతున్న సమయంలో సబలెంకా చేసిన వింత శబ్దాలపై అంపైర్ లూయిస్ అజెమర్ ఎంగ్జెల్ 'హిండ్రెన్స్' (ఆటకు ఆటంకం) కింద పాయింట్ కట్ చేయడం తీవ్ర దుమారం రేపింది. ఈ నిర్ణయంపై సబలెంకా అంపైర్‌తో తీవ్రంగా వాదించి, వీడియో రివ్యూ కోరారు. అయితే అంపైర్ తన నిర్ణయానికే కట్టుబడటంతో మైదానంలో వాతావరణం మరింత వేడెక్కింది.

### సబలెంకా సరికొత్త చరిత్ర:

రాజకీయ ఉద్రిక్తతలు, వివాదాల మధ్య సాగిన ఈ పోరులో సబలెంకా తన విశ్వరూపం చూపింది. కేవలం 1 గంట 16 నిమిషాల్లోనే స్విటోలినాను 6-2, 6-3 తేడాతో మట్టికరిపించింది. ఓపెన్ ఎరాలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా నాలుగు సార్లు ఫైనల్‌కు చేరిన మూడో క్రీడాకారిణిగా (గతంలో ఎవోన్ గూలాగాంగ్, మార్టినా హింగిస్ మాత్రమే ఈ ఘనత సాధించారు) నిలిచింది. శనివారం జరగనున్న ఫైనల్లో ఆమె కజకిస్థాన్ స్టార్ ఎలెనా రైబాకినాతో తలపడనుంది.

# భారీ లక్ష్యాల ఛేదనలో బయటపడ్డ భారత్ బలహీనత

## ప్రపంచకప్ ముంగిట టీమిండియాను కలవరపెడుతున్న గణాంకాలు



**విశాఖపట్నం, జనవరి 29:** స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీబీ సీరీస్‌లో భారత్ తొలి ఓటమిని చవిచూసింది. ఐదు మ్యాచ్‌ల ఈ సీరీస్‌లో వరుసగా మూడు విజయాలతో జోరుమీదున్న భారత్, క్లీన్‌స్వీప్ దిశగా సాగుతుందని అభిమానులు ఆశించారు. కానీ బుధవారం విశాఖపట్నంలో జరిగిన నాలుగో మ్యాచ్‌లో కివీస్ 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 216 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, 18.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ ఓటమితో టీమిండియాను ఒక పాత బలహీనత మళ్లీ వేధిస్తోంది.

### 210 పరుగుల గండం

టీబీ ఫార్మాట్‌లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నా, 210 కంటే ఎక్కువ పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చినప్పుడు మాత్రం తడబడుతోంది. గణాంకాలను పరిశీలిస్తే, టీబీ చరిత్రలో భారత్ ఇప్పటివరకు 118 సార్లు ఛేజింగ్ చేయగా, 80 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అయితే ఈ 80 విజయాల్లో ఒక్కటి కూడా 210 కంటే ఎక్కువ లక్ష్యాన్ని ఛేదించినది లేదు. స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ, భారీ స్కోర్లను వేటాడే క్రమంలో ఒత్తిడికి లోనవ్వడం ప్రపంచకప్ ముంగిట ఆందోళన కలిగిస్తోంది.

### వరుస సీరీస్ విజయాల జోరుకు బ్రేక్

ఇప్పటికే వరుసగా 11 టీబీ సీరీస్‌లను గెలుచుకున్న భారత్, ఈ మ్యాచ్‌లోనూ గెలిచి తన ఆధిపత్యాన్ని చాటాలని భావించింది. సీరీస్‌లోని మూడో మ్యాచ్‌లో 154 పరుగుల లక్ష్యాన్ని కేవలం 10 ఓవర్లలోనే పూర్తి చేసి రికార్డు సృష్టించిన జట్టు, 216 పరుగుల భారీ లక్ష్యం ముందు మాత్రం చేతులెత్తేసింది. త్వరత్వరగా వికెట్లు పడటం, పెరిగిన రన్ రేట్ ఒత్తిడిని అధిగమించలేకపోవడమే ఓటమికి ప్రధాన కారణమైంది.

### ప్రపంచకప్ సవాల్

మరో 9 రోజుల్లో టీబీ ప్రపంచకప్ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. నాకౌట్ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థి జట్టు 200 పైచిలుకు స్కోరు సాధిస్తే భారత్ ఒత్తిడికి లోనవుతుందనే సంకేతాన్ని ఈ ఓటమి ఇచ్చింది. ఇప్పటికైనా భారీ ఛేదనల్లో ఆత్మవిశ్వాసంతో ఆడేలా జట్టులో మార్పులు రావాలని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నాకౌట్ పోరులో పట్టు వీడకుండా పోరాడకపోతే టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ఆర్సీబీ మాస్ బ్యాటింగ్.. ఫైనల్ బెర్త్ ఖరారు!

- వారియర్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం
- కెప్టెన్ స్మృతి మంధాన, గ్రేస్ హారిస్ మెరుపు హాఫ్ సెంచరీలు
- వడోదర వేదికగా ఆధిపత్యం చాటిన బెంగళూరు బౌలర్లు
- సీజన్ ముగియకముందే ఫైనల్లోకి అడుగుపెట్టిన తొలి జట్టుగా ఆర్సీబీ రికార్డు

**వడోదర, జనవరి 29:** మహిళల ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తన జైత్రయాత్రను కొనసాగిస్తూ ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. గురువారం వడోదరలోని బీసీఏ మైదానంలో యూపీ వారియర్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆర్సీబీ 8 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో లీగ్ దశలో అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్న బెంగళూరు జట్టు, నేరుగా ఫైనల్ చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది.

### తడబడ్డ వారియర్స్..

అదరగొట్టిన బౌలర్లు: టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. ఓపెనర్ మెగ్ లానింగ్ (41) మరియు దీప్తి శర్మ (55) పోరాడినప్పటికీ, మిగతా బ్యాటర్లు ఎవరూ రాణించలేకపోయారు. ఆర్సీబీ బౌలర్లలో నదీన్ డీ క్లెర్క్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 4 వికెట్లు తీసి వారియర్స్‌ను దెబ్బతీసింది. లారెన్ బెల్, ఆశా శోభన చెరో వికెట్ సాధించి కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. 144 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు స్మృతి మంధాన మరియు గ్రేస్ హారిస్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. గ్రేస్ హారిస్ కేవలం 36 బంతుల్లోనే 13 ఫోర్లు, 2 సిక్సర్లతో 75 పరుగులు చేసి స్టేడియాన్ని హోరెత్తించింది. మరోవైపు కెప్టెన్ స్మృతి మంధాన 27 బంతుల్లోనే 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 54 పరుగులు చేసి



అజేయంగా నిలిచింది. వీరిద్దరి వీరవిహారంతో ఆర్సీబీ కేవలం 13.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.

### ఫైనల్ దిశగా ఆర్సీబీ

ఈ సీజన్‌లో ఆర్సీబీ ఆడిన అన్ని విభాగాల్లోనూ పూర్తి ఆధిపత్యాన్ని కనబరుస్తోంది. ముఖ్యంగా పవర్ ప్లే ఓవర్లలోనే మ్యాచ్‌ను తమ వైపు తిప్పుకోవడంలో ఈ జట్టు సక్సెస్ అవుతోంది. గ్రేస్ హారిస్ దూకుడు మరియు స్మృతి మంధాన క్లాస్ ఇన్నింగ్స్‌లు ఆర్సీబీకి కొండంత బలాన్ని ఇస్తున్నాయి. నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించడంతో ఆర్సీబీ అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. ఈ నెల 31న గుజరాత్ జెయింట్స్ మరియు ముంబై ఇండియన్స్ మధ్య జరిగే మ్యాచ్ ఫలితం తర్వాత ఎలిమినేటర్ పోరులో ఎవరు తలపడతారో తేలనుంది.

# మహేష్ బాబు నా ఫేవరేట్ తెలుగు హీరో


## విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ

సూపర్ స్టార్ నటనకు ఫిదా అయిన టీమిండియా ఆటగాడు

**హైదరాబాద్, జనవరి 29:** టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తనకు టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు అంటే చాలా ఇష్టమని వెల్లడించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఖాళీ సమయంలో మహేష్ బాబు సినిమాలు చూస్తానని, హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆయన క్రేజ్ గురించి తన సహచర తెలుగు ఆటగాళ్లను అడిగి తెలుసుకుంటానని చెప్పారు.

అలాగే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' సినిమా తనకు పిచ్చెక్కించిందని, ఆ చిత్రంలోని మేనరిజమ్స్ తనను బాగా ఆకట్టుకున్నాయని తెలిపారు. తన సహచర ఆటగాళ్లు నితీష్ రెడ్డి, తిలక్ వర్మల సాయంతో తెలుగు డైలాగులు నేర్చుకుంటున్నట్లు, హైదరాబాద్ బిర్యానీ అంటే తనకు ఎంతో ఇష్టమని అభిషేక్ శర్మ పేర్కొన్నారు.







## ఎన్టీఆర్ పేరు వాడితే జైలుకే..

నటుడు జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ కల్పించింది. అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు, గుర్తింపు, ఇమేజ్ ను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఎన్టీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ను పరిశీలించిన కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం ఎన్టీఆర్ పేరు, "ఎన్ టీఆర్", "జూనియర్ ఎన్ టీఆర్", "తారక్" వంటి పేర్లు, "యంగ్ టైగ ర్", "మ్యాన్ ఆఫ్ మాసెస్" వంటి బిరుదులు, ఆయన ఫొటోలు, ఇమేజ్ ను అనుమతి లేకుండా వాణి జ్యంగా వినియోగించడం చట్ట విరుద్ధం. ఎక్కడైనా ఇలా అనధికార వినియోగం జరిగితే వెంటనే తొలగించాలని కోర్టు స్పష్టం చేసింది.

### పూర్తి హక్కులు ఎన్టీఆర్‌కే

నందమూరి తారక రామారావు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న సెలబ్రిటీ అని కోర్టు పేర్కొంది. ఆయన పేరు, రూపం ప్రజలకు ప్రత్యేక గుర్తింపుగా మారాయని, అందువల్ల వాటిపై హక్కులు ఆయనకే చెందుతాయని అభిప్రాయపడింది. వ్యక్తి పేరు, ఇమేజ్ వంటి వ్యక్తిత్వ హక్కులు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛతో అనుసంధానమై ఉంటాయని, ఇవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 కింద రక్షణ పొందుతాయని వివరించింది. కాపీరైట్ చట్టం 1957, ట్రేడ్‌మార్క్ చట్టం 1999 కింద కూడా ఈ హక్కులను అమలు చేయవచ్చని తెలిపింది. ఇంటర్మీడియరీ ప్లాట్‌ఫామ్‌లైన ఫేస్‌బుక్, యూట్యూబ్‌లకు కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2021 ఐటీ రూల్స్ కింద ఈ పిటిషన్‌ను అధికారిక ఫిర్యాదుగా పరిగణించి, హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన లింక్‌లను చట్టపరంగా నిర్ణయించిన గడువుల్లో తొలగించాలని సూచించింది.

### AI కంటెంట్‌పైనా ఆంక్షలు

ఎన్టీఆర్ పేరు, ఫొటో, ఇమేజ్, గుర్తింపును మెర్చం డైజ్, డిజిటల్ కంటెంట్, మార్ఫ్ చేసిన చిత్రాలు, AI కంటెంట్ లేదా ఏదైనా టెక్నాలజీ ద్వారా వాణిజ్య ప్రయోజనాల కోసం వాడకూడదని కోర్టు స్పష్టం చేసింది. డిజిటల్ యుగంలో పబ్లిక్ పర్సనాలిటీల గుర్తింపు రక్షణ అ త్యంత కీలకమని పేర్కొన్న కోర్టు, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

# దసరా రేస్‌లో 'పెద్ది'–'ఫౌజీ'

### టాలీవుడ్‌కు హై ఓల్టేజ్ పోటీ




గత ఏడాది దసరా సీజన్ టాలీవుడ్‌కు భారీ వసూళ్లు అందించింది. ప వన్ క ళ్యాణ్ 'ఓజీ', 'కాంతారా 2' చిత్రాలు వారం రోజుల వ్యవధిలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించాయి. అదే తరహాలో ఈ దసరా సీజన్ కూడా ఆసక్తికరమైన పోటీకి వేదిక కాబోతోందన్న చర్చ మొదలైంది. ప్రభాస్ ప్రస్తుతం ఫిబ్రవరి 2 నుంచి 'కల్కి 2' షూటింగ్‌లో పాల్గొననున్నాడు. పది రోజుల షెడ్యూల్ అనంతరం తన పూర్తి సమయాన్ని 'ఫౌజీ' చిత్రానికి కేటాయించనున్నట్లు సమాచారం. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే 50 శాతం కంటే ఎక్కువ షూటింగ్ పూర్తి చేసుకుంది. మిగతా భాగాన్ని త్వరితగతిన పూర్తిచేసి, ద సరా కానుకగా విడుదల చేయాలని మేకర్స్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ తన మరో ప్రాజెక్ట్ స్పిరిట్' షూటింగ్‌కు తాత్కాలిక విరామం ఇచ్చినట్టు సమాచారం. అన్నీ అనుకున్నట్టుగా సాగితే 'ఫౌజీ' ఈ దసరాకు థియేటర్లలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' కూడా దసరా బరిలో నిలిచినట్టు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. తొలుత మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయాలనుకున్న ఈ చిత్ర షూటింగ్ ఇంకా రెండు నెలలు పెండింగ్ ఉండటంతో ఆ ప్లాన్ వాయిదా పడింది. మే 1 విడుదల ఆలోచన కూడా వి రమించుకుని, దసరా సీజన్‌ను లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమాకు పోస్ట్ ప్రొడక్షన్‌పై ఎక్కువ సమయం కేటాయించాలనుకుంటుండటంతో, ప్రశాంతంగా దసరా సెలవుల్లో విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఒకవైపు రామ్ చరణ్ 'పెద్ది', మరోవైపు ప్రభాస్ 'ఫౌజీ'... ఈ రెండు భారీ చిత్రాలు ఒకే సీజన్‌లో విడుదలైతే టాలీవుడ్‌కు మరోసారి పెద్ద టర్నోవర్ ఖాయమనే అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం 'పెద్ది'పై హైప్ ఎక్కువగా కనిపిస్తోంది. 'ఫౌజీ' నుంచి ఇప్పటివరకు ప్ర మోషనల్ కంటెంట్ తక్కువగానే వచ్చినప్పటికీ, విడుదల సమయం దగ్గరపడేకొద్దీ అంచనాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే కమర్షియల్ అంశాలు ఎక్కువగా ఉన్న చిత్రంగా 'పెద్ది' దసరా రేస్‌లో పైచేయి సాధించే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.


# వెంకీ–త్రివిక్రమ్ వీడియో వైరల్




వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' షూటింగ్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్ జెబిఎస్ ప్రసాద్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ వద్ద జరిగిన చిత్రీకరణలో వెంకటేష్ స్టైలిష్ లుక్ ఆకట్టుకుంటోంది. మేలోపు షూటింగ్ పూర్తి చేసి, సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి.

# రిలీజ్ డేట్ తో షాకిచ్చిన రాజమౌళి






RRR వంటి గ్లోబల్ హిట్ త ర్వాత రాజమౌళి తెరకెక్కిస్తున్న చిత్రం 'వారణాసి'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ సినిమాలో సూపర్ స్టార్ మహేష్ బాబును ఇప్పటివరకు క నిపించని స్థాయిలో చూపించాలనే లక్ష్యంతో రాజమౌళి పని చేస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో మహేష్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇందులో ఆయన శ్రీరాముడి రూపంలోనూ కనిపించనున్నట్లు సమాచారం. ఆ సన్నివేశాల షూటింగ్ గ్లోబెట్రాటర్ ఈవెంట్‌కు ముందే పూర్తయ్యిందని రాజమౌళి స్వయంగా వెల్లడించాడు. తన మొబైల్ వాల్‌పేపర్‌గా కూడా మహేష్ శ్రీరాముడి లుక్ ఉన్న ఫొటోనే పెట్టుకున్నట్టు చెప్పాడు. 'వారణాసి' రాజమౌళి కెరీర్‌లోనే అత్యంత వేగంగా పూర్తయ్యే చిత్రంగా నిలవనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోపు టాకీ పార్ట్ మొత్తం పూర్తి చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మహేష్ బాబు భాగానికి సంబంధించిన షూటింగ్ సెప్టెంబర్‌కే ముగిసే అవకాశాలు ఉన్నాయి. వీఎఫ్ఎక్స్ పనులు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. అన్ని అనుకున్నట్టే జరిగితే 2027 ఏప్రిల్ 7న సినిమాను విడుదల చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ తేదీని అధికారిక ప్రకటన లేకుండానే రాజమౌళి వినూతనంగా సూచించాడు. వారణాసి ప్రాంతంలో ఏర్పాటు చేసిన రెండు బ్యానర్లలో ఒకదానిపై 'In Theatres', మరొకదానిపై '7 April 2027' అని మాత్రమే ఉండటం చర్చనీయాంశమైంది. ఇంత నిశ్శబ్దంగా విడుదల తేదీని ప్రకటించడం రాజమౌళికే సాధ్యమని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మార్చి 5న ప్రభాస్ నటించిన 'స్పిరిట్' విడుదల కానుంది. ఆ సినిమాపైనా భారీ అంచనాలు ఉన్నాయి. ఒక నెల గ్యాప్‌లో రెండు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియన్ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రావడం అ రుదైన పరిణామంగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బాలీవుడ్ కు బోయపాటి..

### దురందర్ హీరోతో కథ చర్చలు



టాలీవుడ్ మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను తదుపరి ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తికర ప్రచారం సాగుతోంది. 'అఖండ', 'అఖండ 2 (తాండవం)' చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద తన మార్క్ చూపించిన బోయపాటి, ఇప్పుడు బాలీవుడ్ వైపు అడుగులు వేయనున్నాడన్న చర్చ మొదలైంది. తాజాగా బోయపాటి శ్రీను ముంబై వెళ్లి బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్‌ను కలిసినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఒక భారీ యాక్షన్ కథను ఆయన వినిపించారని, దానికి రణవీర్ సింగ్ సానుకూలంగా స్పందించినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ప్రశాంత్ వర్మతో రణవీర్ సినిమా పట్టాలెక్కకపోయిన నేపథ్యంలో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఆసక్తి పెరిగినట్టు తెలుస్తోంది. బోయపాటి చెప్పిన హై–వోల్టేజ్ మాస్ సబ్జెక్ట్ రణవీర్‌కు నచ్చిందని, చర్చలు ప్రాథమిక దశలో కొనసాగుతున్నాయని సమాచారం. ఈ సినిమా ఓకే అయితే బోయపాటి కెరీర్‌లోనే అతిపెద్ద అ వకాశంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రణవీర్ సింగ్ స్థాయి స్టార్‌తో సినిమా అంటే అది కేవలం బాలీ వుడ్‌కే పరిమితం కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ప్రభావం చూపుతుందన్న అంచనాలు ఉన్నాయి. బోయపాటి మార్క్ యాక్షన్, రణవీర్ ఎనర్జీ క లిస్తే వెండి తెరపై మాస్ సందడి ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రాజెక్ట్ ఖరారైతే మైత్రీ మూవీ మేకర్స్ లేదా మరో ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉందని సమాచారం.

# ప్రియాంక సంప్రదాయ అందాలు



మరాఠీ సినిమా, టెలివిజన్ రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి ప్రియాంక ఖోల్గాడే మరోసారి వార్తల్లో నిలిచారు. నటనతో పాటు స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె, తాజాగా సంప్రదాయ వస్త్రధారణలో కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. ఎథ్నిక్ అవుట్‌ఫిట్‌లో ప్రియాంక ఖోల్గాడే చూపించిన అందం, లావణ్యం నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. చీరలైనా, ఇతర సంప్రదాయ దుస్తులైనా సహజమైన హావభావాలతో, క్లాసీ స్టైల్‌తో ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. సినిమాలు, టీవీ షోలు, మ్యూజిక్ వీడియోల ద్వారా మంచి గుర్తింపు పొందిన ప్రియాంక, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కూడా దూసుకుపోతున్నారు. తాజాగా విడుదలైన ఆమె ఎథ్నిక్ ఫోటోలు ప్రస్తుతం వైరల్‌గా మారగా, అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నటనతో పాటు ఫ్యాషన్‌లోనూ తనదైన ముద్ర వేస్తూ, ప్రియాంక ఖోల్గాడే భవిష్యత్తులో మరిన్ని అవకాశాలతో ముందుకు సాగుతారని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# అల్లు అర్జున్–లోకేశ్ మూవీలో బాలీవుడ్ బ్యూటీ

ఐకాన్‌స్టా ర్అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రానికి అధికారిక అనౌన్స్‌మెంట్ వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఒక పుస్తకం ఆధారంగా రూపొందుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ కథ బాక్సాఫీస్‌పై భారీ ప్రభావం చూపుతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో అల్లు అర్జున్ సూపర్ నేచురల్ శక్తులు ఉన్న సైంటిస్ట్ పాత్రలో కనిపించనున్నట్టు సమాచారం. ఇక హీరోయిన్‌గా బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ఎంపికైందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రద్ధా 'ఈట' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. ఇప్పటికే ప్రభాస్ 'సాహో'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమెకు, ఈ ప్రాజెక్ట్ మరింత గుర్తింపు తీసుకురావొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**